# 4

# క్రీస్తు మహాత్త్వము

## కొలొస్సయులకు 1:15-20

కొలొస్సయులకు వ్రాయబడిన పత్రిక 1:15-20లో ఒక పరివర్తనము సంభవించుచున్నది. పౌలు తన శుభాభివందనములు తెలియజేయుట మరియు ఎఫెస్సీయుల పక్షమున ఆయన, ఆయనతో కూడా నుండినవారు చేయుచుండిన ప్రార్థనల గూర్చిన ప్రస్తావనను ముగించాడు. ఆ తరువాత యేసు క్రీస్తు యొక్క మహాత్త్వము, స్వభావము, మరియు స్థానమును ప్రశంసించుటకు మొదలుపెట్టాడు. యేసు (1) దేవుని స్వరూపము, ఈ విషయము క్రొత్త నిబంధనలో యింకా రెండు ఇతర స్థలములలో పేర్కొనబడియున్నది (2 కొరింథీయులకు 4:4; హెబ్రీయులకు 1:3); (2) సర్వ సృష్టికి ఆదిసంభూతుడు; (3) సర్వమును సృష్టించినవాడు; (4) సమస్తమునకు పూర్వమే ఉన్నవాడు; (5) సమస్తమునకు ఆధారభూతుడు; (6) సంఘమునకు శిరస్సు; (7) సృష్టికి ఆదిసంభూతుడు; (8) మృతులలో నుండి లేచిన ఆదిసంభూతుడు; (9) అన్నిటిలో ప్రాముఖ్యమైనవాడు; (10) సర్వ సంపూర్ణతతో నిండియున్నవాడు; మరియు (11) దేవునికిని మానవునికిని మధ్య నుండు సమాధానమునకు ఆధారమై యున్నాడని ఆయన రచించాడు.

**వచనములు 15** మొదలుకొని 20 వరకు గల వాక్యభాగములో ఆది సంఘము చేత ఉపయోగింపబడిన ఒక స్తుతిగీతమున్నదని కొందరు వ్యాఖ్యానకర్తలు నమ్ముదురు. వచనాలు 15-17, వచనాలు 18-20తో సమాంతరమై యున్నవనియు, కొంత పునః నిర్మాణము జరిగిన తరువాత, ఆది కాలములో గానం చేయబడుచుండిన కీర్తనలలో పాటింపబడినటువంటి ఛందస్సు ఈ వచనములలో కనబడుచున్నదనియు భావింపబడుచున్నది. యేసు ఇహలోకములో ప్రవేశించి, నిష్క్రమించిన వివరము కూడ 1 తిమోతి 3:16లో తెలియజెప్పబడియున్నది, ఇది ఆది సంఘము పాడుచుండిన ఒక కీర్తనగా ఎంచబడియున్నది. యేసు యొక్క వైభవోపేతమునకు సంబంధించి ఆయన చేసిన తన వ్యాఖ్యానములను వృద్ధిచేయగలుగునట్లు పౌలు సుపరిచితమైన నానుడులను లేదా ఆది సంఘము పాడుకొనుచుండిన పాటలను చేర్చాడని కొందరనుకొనుచున్నారు. (1 తిమోతి 1:15; 3:1; 4:8, 9; 2 తిమోతి 2:11-13; తీతు 3:4-8 చూడుము.)

పౌలు, క్రీస్తును గూర్చిన తన ఉపదేశములను నివేదించుచు, జ్ఞానతత్వవాదుల సిద్ధాంతములో యేసును గూర్చి ఉండిన తప్పులకు తగిన సమాధానమిచ్చుచుండిననునది మరొక వక్కాణింపై యున్నది. బహుశా ఇది సరైనది కాకపోవచ్చును, ఎందుచేతననగా ఆ సమయంలో జ్ఞానతత్వవాదుల సిద్ధాంత సంబంధమైన విత్తనములు మాత్రమే విత్తబడుచుండినవి, సంపూర్ణముగా అభివృద్ధిచెందిన జ్ఞానతత్వవాదుల సిద్ధాంతము రెండవ శతాబ్దము నాటికి కూడా అవతారమెత్తలేదు. అట్లయినప్పటికిని, యేసు గూర్చి పౌలు చేయుచుండిన చర్చలో జ్ఞానవాదులు సిద్ధాంత ఆలోచనలకును, అభిప్రాయమునకును అసమ్మతిని తెలియజేసిన సమాచారము అందులో కలుపబడి యుండినది.

## అదృశ్య దేవుని స్వరూపము మరియు సర్వసృష్టికి ఆదిసంభూతుడు (1:15)

**[15]ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టకి ఆదిసంభూతుడై యున్నాడు.**

### "ఆయన అదృశ్య దేవుని స్వరూపియై యున్నాడు" (1:15)

**యేసు అదృశ్య దేవుని స్వరూపమై యున్నాడని** పౌలు ప్రస్తావించాడు. "స్వరూపము" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*eikōn*) "మూర్తి" అను పదముగా "icon"గా భాషాంతరీకరణము చేయబడవచ్చును. దీనికి "పోలిక" అని అర్థము. సనాతనాచారమును పాటించుచుండిన ప్రాశ్చ్య ప్రదేశములోని సంఘములు యేసు, మరియ మరియు నానావిధ పరిశుద్ధుల స్వరూపములను గుర్తించుకొనుటకు వారి "ప్రతిమలు/మూర్తులు," వర్ణచిత్రములు లేదా ప్రతినిధులుగా నుండిన పటములు కలిగియుండినవి. యేసు, తండ్రి యొక్క "మూర్తిమంతమై" యున్నాడు, ఆయన తండ్రి యొక్క ఒకే ఒక్క నిజమైన ప్రత్యక్షత మరియు సంపూర్ణమైన ప్రతినిధియై యున్నాడు. ఇచ్చట వాడబడినట్లుగా "స్వరూపము" అనునది ఒక బాహ్యపోలికను చూపించు చిత్రమునకు భిన్నమైనదై యున్నది కానీ అంతరంగ వ్యక్తిని మరియు వ్యక్తిత్వమును బయలుపరచజాలదు. యేసే తండ్రి యొక్క సంపూర్ణమైన స్వరూపమై యున్నాడు. ఏలయనగా దేవుని సంపూర్ణతను మరియు దైవిక స్వభావమును ఆయన కలిగియున్నాడు. అదృశ్యుడైన దేవుని యేసు దృశ్యమానము చేసి ఆయనను అవగాహన చేసికొనగలవానిగా చేసాడు. ఆయన ద్వారా దేవుని సంపూర్ణత బయలుపరచబడినది.

మానవాళికి తండ్రిని బయలుపర్చుటకు యేసు అరుదెంచాడు (యోహాను 1:18). యేసును చూచినవారు తండ్రిని కూడ చూచినట్టే (యోహాను 12:45; 14:9). "ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునైయున్నాడు" (హెబ్రీయులకు 1:3–4). సమస్త విషయములలో ఆయన తండ్రియొక్క అదే సారము, స్వభావము, మహిమ మరియు లక్షణమైయున్నాడు. ఆయన దేవుని అస్థిత్వమునే చిత్రీకరణముచేయుచున్నాడు. యేసు సమస్త మానవులకు దేవుని నిజమైన అభివ్యక్తమై యున్నాడనునది "వాక్యము" (యోహాను 1:1, 14) గూర్చిన అభిప్రాయమై యున్నది. పోలిక గూర్చి పౌలు రచించుచుండిన వివరము కేవలము శరీరధారిగా నున్న యేసు కాదు, కానీ యేసు నిత్యమైన వ్యక్తియై యున్నాడని తెలుపుచున్నది.

ఆయనే దేవుడై యుండనట్లయితే, యేసు మానవ జాతికి తండ్రిని ప్రదర్శించలేడు, ఆయన తండ్రికి ఒక నిజమైన మూర్తిమంతము కంటే తక్కువైనవాడై యుండును. దేవుడు తనతండ్రి అని యేసు సంబోధించుచు ఆయన దేవుని కుమారుడై యున్నాడని స్వాధికారంతో చెప్పినప్పుడు, ఆయన తన తత్వములోనే "దేవుడు" అయియున్నాడని యేసు ధృవీకరించుచుండెనని యూదులు అర్థంచేసికొన్నారు (యోహాను 10:32–36).

వారు ఒకే స్వభావము కలిగియున్నారని యేసు తండ్రితో కలిగియున్న ఏకత్వము సహితము సూచించుచున్నది. "నేనును తండ్రియు ఏకమై యున్నాము" (యోహాను 10:30) అని ఘోషించిన తదుపరి, "తండ్రి నా యందును నేను తండ్రియందును ఉన్నాము" అని చెప్పుచు, యేసు ఈ ఏకత్వములోగల స్వభావమును వివరించాడు (యోహాను 10:38; 14:10, 11, 20 కూడా చూడుము). శారీరక ఉనికిగల తండ్రి మరియు కుమారుడు ఏకమై

యున్నట్లు ఏకమైయుండజాలరు.

యేసు శరీరధారియై మానవుడుగా జీవించక మునుపు మరియు అటుతరువాత సహితము, ఆయన తండ్రి మహిమను మరియు తత్వమును కలిగియుండెను మరియు ఇప్పుడును కలిగియున్నాడు. ఎల్లకాలములందును ఆయన తండ్రి వైఖరి, లక్షణము, మరియు ఆలోచనాధోరణి పంచుకున్నాడు. వారి ఆధ్యాత్మిక మరియు మానసిక అంగరచనలో వారి మధ్య అన్ని కోణాల్లోను సంపూర్ణమైన ఏకీభావమున్నది. దీనిని బట్టియే, యేసు తండ్రి యొక్క సంపూర్ణమైన మూర్తిమంతమునై యున్నాడు. ఆయన మరియు తండ్రి ఒకే విశ్వదర్శనము, ఒకే ఆధ్యాత్మికమును, నిత్యమైనదియు, మరియు నైతికమునైన దృష్టికోణము కలిగియున్నారు. ఒకడు యేసు వైఖరిని మరియు దృక్పథమును అర్థంచేసికొన్నట్లయితే, ఈ కోణాల్లో తండ్రిని కూడ అర్థంచేసికొంటాడు. యేసు తత్వమును "చూచువారు," లేక అవగాహనచేసికొనువారు తండ్రి తత్వమును గ్రహించుదురు.

మానవుడు దేవుని గూర్చిన అస్పష్టభావములను కలిగియుండెను కానీ యేసు ఇహలోకమును వచ్చునంత వరకు ఆయన తత్వమును గూర్చిన సంపూర్ణ బయల్పాటును మానవుడు కలిగియుండలేదు. "నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు" అని యేసు ఫిలిప్పుకు వివరించాడు (యోహాను 14:9; యోహాను 12:45 చూడుము). యేసు మానవ శరీరము ధరించిన దేవుడై యుండెను (యోహాను 1:14; 1 తిమోతి 3:16).

దేవుడు అదృశ్యుడై యున్నందున, ఆయనను శారీరక దృష్టికోణంలో అర్థం చేసికొనలేము. ఆయన భౌతికముగా ప్రకృతి సంబంధమైన వస్తువులను ఉపయోగించుచు శిల్పకారుల నైపుణ్యంతో చేయబడిన వాటి చేత ప్రాతినిధ్యం వహింపబడజాలడు. ధర్మశాస్త్రము ఇయ్యబడినప్పుడు, దేవుని ఏ రూపమైనను కనబడలేదు. ఈ హేతువును బట్టి, ఆయన గూర్చిన భౌతికమైన ఎటువంటి మూర్తిమంతములైనను చేయకూడదు (ద్వితీయోపదేశ కాండము 4:15–18).

మోషే దేవుని వెనుక పార్శ్వమును చూసాడు, కానీ ఆయన ముఖమును చూడలేదు (నిర్గమకాండము 33:20–23), ఏలయనగా ఎవడును దేవుని ముఖమును చూసి బ్రతుకలేడు. మామూలుగా మానవ కన్నులు చూడలేని దానిని మోషే చూడగలుగునట్లు దేవుడు మోషే కన్నులను రూపాంతరీకరణము చేసియుంటాడు, ఇంతటి మహిమాన్వితమైన ప్రకాశించే, మానవ కన్నుల చేత ఆయన చూడబడలేడు చూడబడజాలడు (యోహాను 1:18; 6:46). ఒకడు ఈ దేహములో ఉన్నంత వరకు, వాడు దేవుని చూడలేడు (1 తిమోతి 6:16; 1 యోహాను 4:12). దేవుని దేహమువలె ఆధ్యాత్మిక శరీరములోనికి మార్పునొందిన తరువాత మాత్రమే (1 కొరింథీయులకు 15:44; ఫిలిప్పీయులకు 3:21), క్రైస్తవుడు దేవుని చూచుచు ఆయన ముఖమును వీక్షించగలడు (1 యోహాను 3:2; ప్రకటన 22:4).

## "సర్వసృష్టికి ఆదిసంభూతుడు" (1:15)

యేసును **ఆది సంభూతుడుగా** కూడ పౌలు ప్రస్తావించాడు. "ఆది సంభూతుడు" (*prōtotokos*) అను పదజాలము క్రొత్త నిబంధనలో మరొక చోట వాడబడినది (హెబ్రీయులకు 1:6; ప్రకటన 1:5). అది "*prototype*" అను ఆంగ్ల పదమునకు సహజాతీయమైనది. ఎడుఅర్డ్ స్క్వైజర్ ప్రకారము, "ఈ వ్యక్తీకరణము తన కంటె ఒక పెద్ద సహోదరుని సూచించ

నవసరంలేదు, కానీ తన తండ్రి చేత అత్యధికంగా ప్రేమింపబడిన ప్రత్యేక స్థానమును మాత్రమే సూచించును."[1]

హెబ్రీయుల కుటుంబములో కలిగిన ప్రథమ సంతానమునకు పరమ పరపతి కల్పించబడింది. తండ్రి దీవెనలు (ఆదికాండము 27:1-4, 19, 34-37) మరియు జ్యేష్ఠత్వము (ఆదికాండము 43:33) మొదట వాడే పొందుచుండెను. వాడు తన సహోదరులలో, యాకోబు కుమారులలో అందరి కంటె పెద్దవాడైన రూబేను వలె, ఒక నాయకుడుగా గౌరవింపబడినవాడై యుండెను (ఆదికాండము 37:22, 23 చూడుము). మిగిలిన కుమారులతో పోల్చినట్లయితే, వాడు కుటుంబ స్వాస్థములో రెట్టింపు భాగమును పొందువాడై యుండెను (ద్వితీయోపదేశ కాండము 21:17). అనేక సందర్భములో "ప్రథమ సంతానము" అనగా మొదట పుట్టినబిడ్డ అని భావింపబడినప్పటికిని (ఆదికాండము 19:34; 27:19), అందరికంటె అత్యధికంగా గౌరవింపబడినవాడు లేక ప్రేమింపబడినవాడని కూడా భావింపబడుచుండినది.

ఇశ్రాయేలు, దేవుని ప్రథమ సంతానమని పిలువబడ్డాడు (నిర్గమకాండము 4:22). దావీదు, ప్రథమ సంతానమని ప్రస్తావింపబడ్డాడు (కీర్తనలు 89:27), ఎఫ్రాయిము కూడ అలాగే సంబోధింపబడ్డాడు (యిర్మీయా 31:9). క్రైస్తవుల జన్మ క్రమము భిన్నమైనదైనప్పటికిని, వారు సహితము ప్రథమ సంతానమని ఎంచబడుచున్నారు (హెబ్రీయులకు 12:23). ఇశ్రాయేలు దేవుని ప్రత్యేకార్హతగల జనాంగమై యుండెను, జనములలో మొదట పుట్టిన సంతానము కాదు. వారి కుటుంబములో దావీదు ఎనిమిదవ సంతానమై యుండెను (1 సమూయేలు 16:10, 11), మరియు ఎఫ్రాయిము యోసేపు యొక్క రెండవ కుమారుడై యుండెను (ఆదికాండము 41:51, 52). ఈ వాక్యభాగములో వాడబడిన "ప్రథమ సంతానము" అను పదము మొదటి సంతానముగా పుట్టినవారని అర్థమీయదు. దానికి బదులుగా, "ప్రథమ సంతానము" అను పదము మొదటి సంతానము యొక్క పరపతి మరియు ప్రత్యేకార్హతను సూచించుచున్నది.

> "సర్వసృష్టికి ఆదిసంభూతుడగు" అను పదజాలము కుమారుడు తానే, కూడ, ఒక జీవుడై యున్నాడు, సుదీర్ఘ వరుసలో మొదటివాడను అర్థమీయదనునది, 16వ వచనం చేత స్పష్టముగా వ్యవస్థీకరింపబడుచున్నది. ఆయన సమస్తమునకు ముందున్నవాడు, సమస్తమునకు విలక్షణమైనవాడై యున్నాడు, మరియు సర్వసృష్టి కంటె ఉన్నతముగా హెచ్చింపబడియున్నాడు. ఆది సంభూతుడుగా ఆయన వారసుడును సమస్తమును పరిపాలించువాడై యున్నాడు.[2]

ఇచ్చటను ఇతర చోట్లను పేర్కొనబడినట్లుగా, యేసు ఆదిసంభూతుడై యున్నాడని కొందరు ఎంచుదురు (రోమీయులకు 8:29; కొలొస్సయులకు 1:18; హెబ్రీయులకు 1:6; ప్రకటన 1:5), ఏలయనగా ఆయన మరియ గర్భమున మొదటిసంతానము, యోసేపు కుటుంబంలో తొలి సంతానమై యుండెను. ఏది ఏమైనా, దీని భావము ఇదే అయియుండునని భావింపబడుటకు అవకాశములేదు. ఈ పరిస్థితిలో, సృష్టించబడిన దానంతటికి సంబంధించినంతవరకు ప్రథమ సంతానము యొక్క పరపతి మరియు గౌరవము కలిగియున్నవానివలె యేసును పౌలు మనముందుంచుచున్నాడు. ఆదిసంభూతుడుగా, ఆయన "ప్రాధాన్యము మరియు ఆధిపత్యము లేక సార్వభౌమత్వము కలిగియున్నాడు."[3]

కీర్తనలు 89:27, " 'ఆదిసంభూతుడు' అను బిరుదు యొక్క పాలస్తీనీయుల యూదీయ అన్వయమును మెస్సీయకు వర్తింపజేయుచున్నదని" హెచ్. సి. జి. మోల్ సూచించుచున్నాడు.[4] "ఆదిసంభూతుడు" అను పదము గూర్చి ఆయన ఇంకా ఇలా చెప్పుచున్నాడు,

> అది ఉపయోగింపబడుచున్న విధానము మరియు ఈ సందర్భములను బట్టి అధ్యయనము చేయగా, ఈ పదము ఒకటి రెండు విషయములను తెలుపుచున్నది (ఎ) అస్థిత్వములో గల ప్రాధాన్యము – సృష్టింపబడిన విశాల విశ్వమంతటకి కుమారుడు పూర్వగామిగా కనిపించుచున్నాడు, కాబట్టి ఉనికి కలిగియున్న నిత్యమైన క్రమమునకు చెందుచున్నవాడునై యున్నాడు (తరువాత సందర్భంను చూడుము); (బి) నిత్యమైన ప్రథమ సంతానమైయున్న (ఆది సంభూతుడైయున్న) హక్కుండుటనుబట్టి "సర్వసృష్టిపై" ఆధిపత్యము కలుగుయున్నాడు.[5]

"ఆదిసంభూతుడుగా" దేవుని సృష్టిలో యేసు మొదటివాడై యుండెనని "యెహోవా సాక్షులు" ఉపదేశించుదురు. ఈ విధంగా కూడ చెప్పుదురు,

> (యేసు) దేవుని "ప్రథమ సంతానము" అనియు ఆయన యొక్క "అద్వితీయ"/"ఏకైక" కుమారుడనియు పిలువబడుచున్నాడు (యోహాను 1:14; 3:16; హెబ్రీయులకు 1:6). అనగా, దేవుని ఇతర ఆత్మకుమారులందరికి మునుపే ఆయన సృజింపబడ్డాడనియు, ప్రత్యక్షంగా దేవుని చేత సృజింపబడినవాడు ఆయన ఒక్కడు మాత్రమే అనియు దీని అర్థమై యున్నది. "ఆదిసంభూతుడు" అయివున్న ఈ కుమారుడు ఇతరమైన వాటన్నిటిని సృష్టించుటలో యెహోవాతో పాలుపంచుకొన్నాడని పరిశుద్ధ బైబిలు చాటి చెప్పుచున్నది (కొలొస్సయులకు 1:15, 16).[6]

"యెహోవా సాక్షుల" చేత వాడబడుచున్న ది న్యూ వరల్డ్ ట్రాన్స్‌లేషన్ "ఇతరమైన" అను పదమును కొలొస్సయులకు 1:16లో అదనంగా చేర్చుచున్నది: (ఇతరమైనవి) సర్వమును ఆయన ద్వారా సృజింపబడెను.[7] ఇది యేసు మొదట సృజింపబడినాడనియు ఆ తరువాత ఆయన మిగిలిన దానంతటిని సృజించాడను ధ్వనింపునిచ్చుచున్నది. ఈ ప్రకారము చూచినట్లయితే యేసు కూడ దూతల వలెనే ఒక సృజింపబడిన జీవియై యున్నాడని అది చెప్పుచున్నది. యేసు ఒక దూత కాదు; ఆయన దూతలను అధిగమించినవాడై యున్నాడు గనుక ఆయన దూతల చేత ఆరాధింపబడవలసినవాడై యున్నాడు (హెబ్రీయులకు 1:4, 6).

గ్రీకు క్రొత్త నిబంధనలో గల పాఠ్యభాగము ఇలా చెప్పుచున్నది, *en autō ektisthē ta panta* ("సర్వమును ఆయన యందు సృజింపబడెను"). "ఇతరమైనవి." అను పదము గ్రీకు వాక్యభాగములో లేదు, సరికదా అది ఉన్నదన్న భావము కూడ బయలుపడుటలేదు. "ఇతరమైనవి" అను పదము ఒక అన్యాయమైన వేదాంతశాస్త్ర సంబంధమైన వ్యాఖ్యానముగా దూర్చబడినది, గ్రీకు పాఠ్యభాగము జాగ్రత్తగా అనువాదము చేయబడిన విషయముగా కాదు. యేసు సర్వమును సృష్టించాడు, "గనుక కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు" (యోహాను 1:3). ఈ వాస్తవం యేసు సృజింపబడిన ఒక జీవికాడని నిస్సంశయమైన పరిష్కారమై యున్నదని ఋజువు చేయుచున్నది. ఆయన సర్వమును సృజించుట వారి వేదాంత శాస్త్రములో ఒక సమస్యయై యున్నదని ది న్యూ వరల్డ్ ట్రాన్స్‌లేషన్ అనువాదకులు అర్థంచేసుకొన్నారు; కాబట్టి సర్వమును ఆయన సృజించలేదు కానీ తనను తాను తప్ప, ఇతరమైన సర్వమును సృజించాడను భావము ఇయ్యబడునట్లు

వారు “ఇతరమైనవి” అను పదమును అదనంగా దూర్చారు.

సృజింపబడిన వాటిలో యేసు ప్రథమ వ్యక్తియై లేక దేవుని ప్రథమ సంతానమై యుండజాలడు. ఆయన శాశ్వతమైనవాడై యున్నాడు (మీకా 5:2), ఆయనకి ఆది గాని అంతము గాని లేదు (హెబ్రీయులకు 7:2–3). “ఆయన ఆదిసంభూతుడై యున్నాడనగా”, ఆయన ఆదరణీయమైనదియు అత్యున్నతమైనదియునైన స్థానము కలిగియున్నాడని అర్థము, పుట్టుకలోనైతేనేమి కాలక్రమమును బట్టి మొదటివాడు కాదు.

యేసు “ఆదియైయున్నాడు” అని పౌలు సూచించుచున్నాడు (కొలొస్సయులకు 1:18). ఈ వాంగ్మూలము మరియు యేసు, “దేవుని సృష్టికి ఆదియునైనవాడు” అను యోహాను వాంగ్మూలము (ప్రకటన 3:14) యెహోవా సాక్షుల చేత వక్రభాష్యం గావించబడినవి. ప్రకటన 3:14లోని “ఆదియునైనవాడుకు” సంబంధించినంతవరకు, “అనగా, మూలమైన లేక మూలాధారమునైన” అని చెప్పుటలో NASB లోని అధస్సూచిక సరియైనదై యున్నది. క్రొత్త నిబంధనలోని కొన్ని ఇతర వాక్యభాగములు ఈ దృష్టికోణంలో “ఆరంభము” అను పదమును ఉపయోగించుచున్నవి. “ఆరంభము” (*archē*) అనగా ఏదో ఒకటి మొదలుపెట్టబడిన ప్రారంభ కేంద్రము మరియు క్షణమైయున్నదను అర్థమునిచ్చును (మత్తయి 24:8, 21). ప్రప్రథమ హేతువు, ప్రారంభము ప్రారంభింపబడుటకు గల కారణమైన మూలము గూర్చిన సందర్భములో సహితము ఈ పదము ప్రయోగింపబడినది. ప్రకటన గ్రంథంలో, ఈ పదము యేసును సూచించిన ప్రతి సారి యోహాను దానిని ఇదే విధానములో ఉపయోగించాడు (21:6; 22:13). ఆయనే “ఆదియు అంతమునై” యున్నాడు, అనగా సర్వము కలుగుటకు కారణభూతుడయ్యాడు మరియు కలిగిన సర్వము అంతమగునట్లు చేయువాడును ఆయనే.

ప్రకటన గ్రంథంలోని వాక్యభాగములో, “ఆది” అను పదమును “మూలము” లేక “మూలాధారము” గా ఎంచబడ కూడనిదైనట్లయితే, “అంతము” కూడ “మూలము” లేక “మూలాధారము” అని అనువదింపబడకూడదు. అలాగైతే, యేసునకు ఒక ఆరంభముండినది గనుక ఆయన ఒకనాడు అంతమౌతాడను తుది అభిప్రాయము ఏర్పడును, ఇది వాస్తవము కాదు. యేసు ఆరంభమునకు మూలాధారమై యున్నాడు, గనుక “అంతము” నకు మూలాధారమై యున్నాడనునది దీని అర్థమై యున్నది. ఆయన సర్వసృష్టికి “ఆది”యై యున్నాడు, కలుగజేయబడవలసి యుండిన సర్వమును కలుగజేసినవాడు ఆయనే.

ఆల్బర్ట్ ఐన్‌స్టైన్‌ను “సాపేక్షతత్వ సిద్ధాంతమునకు ప్రారంభకుడై యున్నాడు” అని పిలువవచ్చును. ఇటువంటి వాంగ్మూలము, సాపేక్షతత్వ సిద్ధాంతము ఐన్‌స్టైన్ యొక్క ప్రారంభమును ప్రవేశపెట్టినదను అర్థమునీయదు. అలా కాదు కాని, ఒక మూలాధారముగా, ఆయన సాపేక్షతత్వ సిద్ధాంతమును ఆవిర్భవించాడను అర్థమునిచ్చును. యేసు విషయంలో ఎంతైనా వాస్తవమైయున్నది: సర్వ సృష్టియు కలుగుటకు మూలాధారమును కారణమును ఆయనే అయియున్నాడు, కలిగియున్న సర్వమును ఆయన ద్వారానే ఉనికి కలిగియున్నది.

యోహాను 1:14లో యేసు “అద్వితీయ కుమారుడు” (*monogenēs*) అని పిలువబడ్డాడు, ఈ పదజాలము “ఒకడు” అని అర్థమిచ్చు *mono* మరియు “సంతానము, లక్షణము, లేక రకము” అని అనువదింపబడగల *genos* కలిసిన మిశ్రమ పదజాలమై యున్నది.[8] అద్వితీయుడై యున్నాడను అవగాహన ప్రకారము, “మూలము” గూర్చిన అభిప్రాయము, ఈ పదములో స్వతస్సిద్ధముగా లేదు. దానికి “ఒక రకములో ఒకటి, స్వభావములో

అసమానమైన, వర్గము విషయంలో అంతయు అదే అయివున్న," అను అర్థమున్నది. ఒక్కడే కుమారుడు అని చెప్పుకొబడు సందర్భములో మాత్రమే *monogenēs* అను పదము ఉపయోగింపబడినది (లూకా 7:12; 9:38), యాయీరు కుమార్తె (లూకా 8:42), మరియు ఇస్సాకు (హెబ్రీయులకు 11:17–19). అబ్రాహామునకు ఇస్సాకుతో పాటు హాగరుకు పుట్టిన ఇష్మాయేలు (ఆదికాండము 16:15), కెతూరా ద్వారా కలిగిన ఆరుగురు సంతానము (ఆదికాండము 25:1, 2) సహా ఇతర కుమారులు కూడా ఉండిరి. అట్లయినప్పటికిని, ఇస్సాకు అబ్రాహాము యొక్క ఏకైక కుమారుడై యుండెను. ఒక అసమానుడైన కుమారుడు, ఆ వర్గములో ఒక్కడే అయియుండినవాడు.

ఆయన ఆరంభము కలిగియుండెనను అవగాహన ప్రకారము, యేసు అద్వితీయ కుమారుడై యుండలేదు. ఆయన ఒక రకములో ఒక్కడై, స్వభావములో అసమానుడై, వర్గములో తన తండ్రితో కలిగియుండిన సంబంధము గూర్చి సమస్తమును ఆయనే అయియుండెను. యేసుకు సంబంధించినంత వరకు, *monogenēs* అను పదము, "అద్వితీయుడైనవాడు" అని క్రొత్త నిబంధనలో కేవలము ఐదు సార్లు మాత్రమే అనువదింపబడి యున్నది (యోహాను 1:14, 18; 3:16, 18; 1 యోహాను 4:9). గనుక ఈ వ్యక్తీకరణము ఆధారంగా యేసు ఒక ఆరంభము కలిగియుండెనని నిర్దిష్టమైన రీతిలో నిర్వచింపబడకూడదు.

ఈ దృక్పథమునకు సాయపడుటకు ఈ క్రింది సారాంశము ఒక చక్కని సమాచారమై యున్నది:

> (1) ప్రామాణికమైన శబ్దకోశములు ఈ భావమునకు సాయపడుచున్నవి (ఉదాహరణ MM, pp. 416 f.; Bauer, rev., p. 527 చూడుము). (2) ప్రాచీన లాటిన్ చేతివ్రాత ప్రతులు *monogenes*ను *unigenitus* ("అద్వితీయుడైన"/"ఏకైక") అని చెప్పుటకు బదులుగా, లాటిన్ *unicus* ("ఒక్కడే") అని వ్యాఖ్యానించినవి. వల్గేట్‌లో (నాలుగవ శతాబ్దంలో రచింపబడిన పరిశుద్ధ లాటిన్ బైబిల్, అటు తరువాత రోమన్ కథోలిక్కుల ఉపయోగార్థమై వారి చేత ఆమోదింపబడినది), వేదాంత శాస్త్ర హేతువులనుబట్టి, అనగా యేసు "అద్వితీయుడైన కుమారుడై యుండెను, గాని సృజింపబడలేదు" అను సిద్ధాంతమును స్థిరముగా పదిలపర్చవలెనను ఉద్దేశముతో జెరోమ్ *unicus*ను *unigenitus*గా మార్చేసాడు. (వేదాంతశాస్త్ర సంబంధమైన ఈ దృక్పథము లేకుండిన వాక్యభాగములలో – [లూకా 7:12; 8:42; 9:38]; ఆయన *unicus*ను గ్రీకు పదమైన *monogenes* యొక్క అనువాదముగా ఉంచాడు.) ది వల్గేట్, ఆథోరైజ్‌డ్ వర్షన్ మరియు తరువాతి ఆంగ్ల అనువాదాలపై బలవత్తరమైన ప్రభావమును వినియోగించినది. (3) హెబ్రీ భాషలో *yahid* అను పదము స్థానంలో LXX, *monogenes*ను ఉపయోగించుట మరియు క్రొత్త నిబంధన లూకా 7:12; 8:42; 9:38; హెబ్రీయులకు 11:17లో ఇదే పదమును ఉపయోగించుట "ఒక్కడే" అను అంశమునకు సాయపడుచున్నవని స్పష్టముగా తెలియుచున్నది. (4) అరేబియా దేశంలోని ఎడారుల్లో నివసించు పురాణయుగం నాటి అద్వితీయమైన పక్షి (అదొకమిథ్య – ఈ పక్షి పుట్టనూ లేదు, తన జాతి పక్షి కనినది కూడా కాదు) గూర్చి *monogenes*గా 1 క్లెమె. 25:2 లో రిఫరెన్సు పేర్కొనబడుట వలన "దాని జాతికి చెందినది అదొక్కటే" అని అర్థమిచ్చుటలో గల తాత్పర్యమేమిటో తరచి చూడవలసియున్నది. (5) యేసు యొక్క అద్వితీయత్వమును యోహాను *monogenes* వలె నొక్కివక్కాణించుట *huios* అను పదమును ఆయన యేసునకు మాత్రమే ప్రత్యేకంగా కేటాయించుట ద్వారా ఉద్ఘాటించి చెప్పబడుచున్నది; విశ్వాసులను ఆయన *tekna*, అనగా "పిల్లలు" అని సంబోధించుచున్నాడు.[9]

యేసు సృజింపబడిన సమస్తమునకు మూలాధారుడై యున్నాడు. సర్వమును సృజించిన సృష్టికర్తగా, ఆయన సృజింపబడిన సమస్తమునకు ఆయన అత్యున్నతమైనవాడై యున్నాడు. ఆయన అద్వితీయుడును అసమానుడునైన దేవుని కుమారుడై యున్నాడు.

## సర్వమును సృజించినవాడు (1:16)

**16ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను – సర్వమును ఆయన యందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను.**

యేసు అదృశ్యదేవుని స్వరూపియై యున్నాడనియు సమస్త సృష్టికి ఆదిసంభూతుడునై యున్నాడనియు చూపించి తదుపరి (వచనం 15), యేసు సర్వమును సృజించిన సృష్టి కర్తయై యున్నాడను ఒక గంభీరమైన సత్యము వైపు పౌలు మళ్లాడు. యేసు సృష్టిలో కలిగియున్న సంబంధమును ఒకడు అర్థంచేసికొనవలసిన కీలకమైన పదజాలములు 16 మరియు 17 వచనములలో కలవు.

### "సర్వమును ఆయనయందే సృజింపబడెను" (1:16)

**ఈ వచనము ఏలయనగా (hoti) అను పదముతో మొదలగుచున్నది, అది వివరమును తెలియజేయు ఉపవాక్యమునకు ఒక సూచనయై యున్నది. ఇంతకు మునుపే చర్చింపబడిన యేసు యొక్క ప్రాధాన్యమునకును ఈ క్రింది ప్రకటనలు నిదర్శనమై యున్నవని సూచించుచు, అది 15వ వచనమును 16వ వచనముతో జోడించుచున్నది.**

**సృజింపబడెను** (*ektisthē*, *ktizō* అను మూల పదమునుండి ఉత్పత్తియైనది) అనగా, "శూన్యములో నుండి అస్థిత్వము లోనికి తీసుకొనిరాబడినది" అని అర్థము. యేసు "ఆదిసంభూతుడు" – అనగా, సర్వసృష్టికిని అత్యున్నతమైనవాడై యున్నాడు – "ఏలయనగా," లేక ఎందుకనగా, ఆయన సర్వమును సృజించాడు. "ఇంటికంటే దానిని కట్టిన వాడెక్కువ ఘనత పొందును" (హెబ్రీయులకు 3:3–4). యేసు ప్రథమ సంతానమైన కుమారుడుగా కలిగియున్న స్థానము మరియు గౌరవము ఆయన **సర్వమును,** "భూమ్యాకాశములతో సహా" (ఆదికాండము 1:1) మరియు ఈ విశాల విశ్వమంతటిని సృజించుటను బట్టి కలిగియున్నాడు.

**ద్వారా** అని అనువదింపబడి ఉపసర్గముగా ముందుచేర్చబడిన పదము గ్రీకు భాషలో *en* అయివున్నది. ఈ *en* దాని ప్రాథమిక అర్థమును – "లో"/"లోపల" – కాపాడు కొనవలెనని కొందరు అభిప్రాయపడుదురు: " 'లో'/'లోపల' అను విభక్తి ప్రత్యయ పదము క్రీస్తు, ఒకదాని లో/లోపల సృష్టి అంతము సృజింపబడు ప్రక్రియ జరుగుచుండు 'పరిధి'యై యున్నాడని సూచించునట్లు కనిపించుచున్నది."[10]

క్రొత్త నిబంధనలో నున్న సంబంధిత వాక్యభాగములన్నిటిలోను, సృష్టి క్రమములో యేసు జోక్యమున్నదని, "ద్వారా" అని అర్థమిచ్చు *dia* అను గ్రీకు విభక్తి ప్రత్యయము చేత

వ్యక్తముచేయబడుచున్నది (యోహాను 1:3, 10; 1 కొరింథీయులకు 8:6; హెబ్రీయులకు 1:2). సృష్టింపబడినదంతయును యేసు "ద్వారా" సృష్టింపబడినది. ఆయన ద్వారా సమస్తమును సృష్టింపబడినట్లు ఆయన దానికి కారకుడును, మధ్యవర్తిత్వము వహించుచున్న హేతువునై యుండెను.

తండ్రి మరియు కుమారుడు కూడ సృష్టి క్రమములో జోక్యము కలిగియున్నవారై యుండిరి. భూమ్యాకాశములను దేవుడు సృష్టించాడనియు, "సర్వము"ను యేసు సృష్టించాడనియు గల వాస్తవమునకు యేసు, దేవుడైయున్నాడు కానీ తండ్రి కాదని అర్థమై యున్నది; ఈ సృజనాత్మక ప్రక్రియలో తండ్రితో కూడ ఆయన కుమారుడుగా సహకరించాడు.

ఈ విశాల విశ్వము మరియు సమస్త విధములైన జీవము ఉపస్థితియై యుండుటకు మూడు ప్రతిపాదనలు ఇవ్వబడియున్నవి: (1) అవి సృజింపబడినవి లేదా సృజింపబడలేదు. (2) అవి రూపొందింపబడినవి లేదా రూపొందింపబడలేదు. (3) వాటిని మేధాశక్తిలేనివాడు లేదా మేధాశక్తిగలవాడు ఉనికి లోనికి తెచ్చాడు.

ఈ విశాల విశ్వమంతయు సృజింపబడనట్లయితే, పదార్థము నిత్యమైనదై యున్నది. పదార్థము నిత్యమైనది కాదని విజ్ఞానశాస్త్రవేత్తలు నిర్ధారించారు, అనగా అది సృజింపబడినదని అర్థము. విశ్వములోని తారలకు ఇంధనమును సమకూర్చుచున్నదైన దానికి బదులుగా నింపబడజాలని ఉదజని వాయువు, అంతకంతకు తగ్గిపోవుచున్నది. శక్తి యొక్క ఇవ్విధమైన వాడకము యుగయుగములుకొనసాగలేదు, అది కొనసాగబడజాలదు కూడ. కాలము గడుచుచున్నకొలది ఏదో ఒక రోజున, విశ్వమునకు దాని శక్తి దానికియ్యబడవలెను. ఈ శక్తి కచ్చితముగా ఒక ఆరంభమంటూ ఉండును.

ఈ విశాల విశ్వమునకు ఆరంభమున్నట్లయితే, అది రూపొందింపబడి యుండవలెను లేదా అది రూపొందింపబడలేదు. విశ్వము యొక్క అనేక కోణములు – సూర్యచంద్ర నక్షత్రముల వంటి గగన తలమందలి అలౌకిక ఘటసముదాయము యొక్క కదలికలు, భూమి మీది జీవావరణశాస్త్రం, మరియు సజీవ జీవరాశి స్వభావము మొదలైనవి – ఒక రూపకల్పనను సూచించుచున్నవి. రూపకల్పన ఉన్నట్లయితే, దీనిని సృజించిన శక్తి రూపకల్పన చేయగల సామర్థ్యము తప్పక కలిగియుండును.

విశ్వములోని రూపకల్పన మేధాశక్తిగల వాని ద్వారాగాని మేధాశక్తిలేనివాని గాని కలుగడేయబడినది. వారు సంతానోత్పత్తి గావింపగలుగునట్లు ఆడ మరియు మగ లేక స్త్రీ మరియు పురుషుడు ఒకరి నుండి మరొకరు వెవ్వేరుగా ఎలా అభివృద్ధిచెందగలరు? ఇందుకు (సృష్టి) పరిణామము వేలాది సంవత్సరములుగా కొనసాగిననునది సమంజసమైన సమాధానంకాదు. ప్రతి జాతి ఒకే తరములో సంతానోత్పత్తి గావింపబడవలసి యుండెను లేదా, సమూలంగా అంతరించిపోవలసి యుండెను. ప్రకృతిలోని పునరోత్పత్తి మరియు ఇతరమైన అనేక కోణములు, పదార్థము ఉత్పత్తిచేయజాలని మేధాశక్తిగల రూపకల్పనను చూపించుచున్నవి. మేధాశక్తి సహాయము లేకుండా, పదార్థము ఒక క్రమమునకు బదులుగా క్రమరాహిత్యమువైపే ఉన్ముఖమై యుండును. మేధాశక్తిలేనివానికి రూపకల్పన చేయగల సామర్థ్యముండదు గనుక, ప్రజ్ఞావంతుడైన రూపశిల్పియైనవాడు, దేవుడు, విశ్వమంతటిని సృజించాడనునది సహేతుకమైన తుది అభిప్రాయమై యుండును.

సృష్టింపబడిన విశ్వము గూర్చి పరిశుద్ధ గ్రంథము ప్రాథమికమైన వాదోపవాదములను

చాటి చెప్పుచున్నది:

> ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి (కీర్తనలు 19:1).
>
> ఆయన అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన, తేటపడుచున్నవి (రోమీయులకు 1:20).
>
> ప్రతి యిల్లును ఎవడైన ఒకనిచేత కట్టబడును కట్టినవాడు దేవుడే (హెబ్రీయులకు 3:3–4).

ఈ విశాల విశ్వము మేధాశక్తిగలవాని చేత సృజింపబడినదను విషయమును తృణీకరించగోరువాడు, పదార్థము నిత్యమైనదనియు, అనేకమైన విభిన్న జీవరాశి రూపములను రూపొందించికొనుటకు అది సామర్థ్యము కలిగియున్నదనియు, విశ్వమంతటిలోని క్రమమును అది తనంతట తాను నిర్వహింపగలదనియు విశ్వసించవలెను. ఇట్టి విశ్వాసము విజ్ఞానశాస్త్ర నియమములను కాదని కాలదన్నును మచ్చుకు కొన్ని మామూలు ఉదాహరణములేమనగా, జీవము, జీవమునుండి వచ్చును; అంతకంతకు తగ్గిపోవుచున్న శక్తికి, దానిని భర్తీచేయు మూలాధారము అవసరమై యుండును; మేధాశక్తి వలన కలుగును; మరియు రూపకల్పన, రూపశిల్పికి ఫలితమై యున్నది. అవిశ్వాసియని పిలువబడువాడు సమస్తమును ఎరిగినవాడును, సర్వశక్తిమంతుడనైనవాని సృజనాత్మకమైన మేధావిని నమ్ముటకు బదులుగా సృష్టిలోని అద్భుతములయందు విశ్వసించవలెను.

రెండవ శతాబ్దములో అభివృద్ధిచెందిన జ్ఞానతత్వవాదము ప్రాథమికమైన కొన్ని క్రైస్తవ ఉపదేశములను అంగీకరించలేదు. దేవుడు, పవిత్రమైన ఆత్మయై యుండినవాడు గనుక నిర్మలమైన వెలుగులో నివసించువాడునై యుండి, పదార్థమునకును, పాపాంధకారమునకును మొత్తానికే భిన్నమైనవాడై యున్నాడని దానిని అంటిపెట్టుకొని యుండినవారు బోధించారు. వారి ఆలోచనల్లో, ఆయన భౌతిక శరీరమును ధరించుట అసాధ్యము, గనుక ఆయన పదార్థమును సృజించుట అసంభావ్యమైన అంశమని వారు భావించారు. దేవుడు, పాపము నుండి ఇంతగా వేరైయున్నవాడు, పాపముతో కలుషితమైన ఇటువంటి ఒక లోకమును సృజించియుండడని వారు వాదోపవాదములు చేయుచుండిరి. కాబట్టి, భౌతిక విశ్వము సుదీర్ఘమైన యుగముల, ఒక మంచి దేవతనుండి వాని కంటే తక్కువైన దేవత మీదికి వచ్చిన ప్రసరణముల యొక్క పరంపరల చేత చివరకు చెడ్డపదార్థముగా మారి పొరపాటున సృజింపబడి యుండునని వారు నమ్మారు. విశ్వము యొక్క ఆరంభమునకు సంబంధించిన జ్ఞానతత్వవాదల ఈ తరువాతి బోధలు, పౌలు కొలొస్సీ పత్రికలో రచించిన బోధలతో ఘర్షణ పడుచున్నవి. సృజింపబడిన సర్వమును దూతలకు సంబంధించిన ప్రతినిధుల ద్వారా కాదు గాని, యేసు ద్వారానే సృజింపబడినదని పౌలు ధృవీకరించాడు.

### “ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు ...” (1:16)

యేసు, **ఆకాశమందున్నవియు భూమియందున్నవియు** “సర్వము” సృజింపబడిన క్రమములో కారణార్థకమైనవాడై యుండెను. “ఆకాశములు,” బహువచనం (*ouranois*), ఆకాశమును (అపొస్తలుల కార్యములు 14:17), నక్షత్రాదులతో నిండిన విశాల గగనతలము (ఎఫెసీయులకు 4:10; హెబ్రీయులకు 4:14; 7:26; 2 పేతురు 3:7, 10), మరియు

దేవుని శాశ్వతమైన పరలోక నివాసమును (మత్తయి 6:9; హెబ్రీయులకు 8:1-2)ను సూచించవచ్చును. ఇంకా, ఈ పదము మంచివియు చెడ్డవియునైన ఆత్మలు గల జీవులు నివసించు భూమికి వెలుపలున్న ప్రదేశములు (ఎఫెసీయులకు 1:10) అను అర్థమును కూడ ఇచ్చుచున్నది. ఈ వచనములో, "లో"/"లోపల"/"యందు" మరియు "పైన"/"మీద" అను పదముల ఉపయోగము, దేని చేతనైతే పౌలు ఈ స్థలములలో నివాసముండు సమస్తము అని భావించాడో దాని గూర్చిన ఒక వ్యక్తీకరణమును రూపింపవచ్చును. అలాగైతే, భూనివాసులు మరియు భూప్రదేశములకు ఆవల నున్న ప్రతి ప్రాణియు – దేవదూతలు మరియు సాతాను సంబంధిత జీవులు సహితము – దీనిలో కలుపబడియుందురు.

భూమ్యాకాశములు సృజింపబడక మునుపు, చెడు లేదు. భౌతికమైనదేదియును లేదు. దేవుని ఆత్యాధ్మిక మండలము మాత్రమే ఉపస్థితియై యుండినది. యేసు మరలా వచ్చినప్పుడు, ఆయన సమస్తమును దాని అసలు స్థితికి పునరుద్ధరించును (అపొస్తలుల కార్యములు 3:20, 21); అప్పుడు భౌతికమైనదేదియును నిలిచియుండదు. శాశ్వతమైనది, కంటికి కనబడని ఆధ్యాత్మిక మండలము మాత్రమే నిలిచి యుండును (2 కొరింథీయులకు 4:18). సృష్టికర్తగా, యేసు సృష్టింపబడిన సమస్తమునకు – ఐహికమైన జీవులు, దురాత్మలు, మరియు దూతల సైన్యసమూహములకు సహితము – అత్యున్నతమైనవాడై యున్నాడు (1 పేతురు 3:22 చూడుము). భూమ్యాకాశముల యందంతటను యేసు కలిగియున్న అధికారము విషయములో ఒకే ఒక మినహాయింపు – తండ్రి, ఆయన సమస్తమును యేసు పాదములక్రింద ఉంచియున్నాడు (1 కొరింథీయులకు 15:27).

**"దృశ్యమైనవిగాని మరియు అదృశ్యమైనవిగాని" (1:16)**

సృజింపబడిన సర్వములో, **దృశ్యమైన దాని** కంటే అధిక శాతము సహాయము లేని కంటికి **అదృశ్యమైనదై** యున్నది. భౌతికమైనదంతయును కంటికి కనబడని రేణువులతో చేయబడియున్నది. "దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదని" పరిశుద్ధ బైబిలు ప్రకటించునప్పుడు, వైజ్ఞానిక శాస్త్రమునకు సంబంధించినంత వరకు అది తెలియజెప్పుచున్నది సరైనదై యున్నది (హెబ్రీయులకు 11:3). దేవుడు సమస్తమును శూన్యములో నుండి సృష్టించాడని ఇది సూచించుచున్నది.

పౌలు భూమ్యాకాశములలో ఉన్నవాటిని ఉద్దేశించి ప్రస్తావించునట్లయితే, ఆయన కంటికి కనబడు ఐహిక నివాసులను మరియు భూప్రదేశమునకు వెలుప నున్న కంటికి కనబడని ఆత్మల సమూదాయముతో పాటు, దేవుని మరియు అపవాది దూతలను ఈ భావములో చేర్చియున్నాడు. మనము మన కనుచూపునంతా నిత్యమైనవియు, కంటికి కనబడనివియు, పరలోక సంబంధమైన విషయములపైనను నిలిపియుంచవలెను (2 కొరింథీయులకు 4:18; కొలొస్సయులకు 3:1).

సృష్టికర్తగా, అవి మానవుని కంటికి కనబడునవైనను లేక కనబడనివైనను, సృష్టింపబడిన సమస్తమునకు, యేసు అత్యున్నతమైనవాడై యున్నాడు. ఈ హేతువును బట్టియే, భౌతికమైన దేనినైనను లేదా దేవదూతల ఉనికి కలిగినవారివంటి వారైనా ఇతరులైనా, కంటికి కనబడని దేనినైనను ఆరాధించాల్సిన లేదా పూజించాల్సిన అవసరం లేదు. యేసు ఎవరైయున్నాడను దానినిబట్టి, మనము ఆయనకు విధేయులమగుచు, ఆయనను సన్మానించుచు, ఆయనను

మాత్రమే ఆరాధించుచు, ఆయనకే లోబడవలసి యున్నది (ఎఫెసీయులకు 1:20–23; హెబ్రీయులకు 1:6; 5:9).

**“అవి సింహాసనములైనను లేక ప్రభుత్వములైనను లేక ప్రధానులైనను లేక అధికారములైనను” (1:16)**

యేసు సృజించిన సమస్తమును గూర్చిన జాబితాను, పౌలు **సింహాసనములైనను లేక ప్రభుత్వములైనను లేక ప్రధానులైనను లేక అధికారములైనను** అని చేర్చాడు. ఇక్కడ, “ఖచ్చితమైన ప్రత్యేకత ఏమియు ఉద్దేశింపబడకయే గ్రీకులో నాలుగు పదములు ఉపయోగింపబడినవి; రోమీయులకు 8:38–39; 1 కొరింథీయులకు 15:24; ఎఫెసీయులకు 1:20–21, 3:10, 6:12; కొలొస్సయులకు 2:10, 15; 1 పేతురు 3:22లో నున్న పోల్చదగిన జాబితాలు చూడుము.”[11] దీని గూర్చి డేవిడ్ ఎమ్. హే ఇలా వ్యాఖ్యానించాడు:

> 1:16లో నున్న “సింహాసనములు” అను పదము క్రొత్త నిబంధనలోని ఇతరమైన మరి ఏ వాక్యభాగములోనైనను లోకాతీతమైన శక్తులని అర్థమిచ్చునట్లుగా వాడబడుచున్నదని అగుపించుటలేదు. ఈ భావముతోనే “ప్రభుత్వములు” అను పదము మరలా ఎఫెసీయులకు 1:21లో వాడబడినది. లోకాతీతమైన “ప్రధానులు” అను అర్థమిచ్చు పదము మరలా 2:10 మరియు 15లోనే గాక రోమీయులకు 8:38లోను; 1 కొరింథీయులకు 15:24; ఎఫెసీయులకు 1:21; 3:10; మరియు 6:12లోను వాడబడినది. “అధికారములు” అని అనువదింపబడిన పదము రోమీయులకు 8లో తప్ప మిగిలిన ఈ వాక్యభాగములన్నిటిలోను “ప్రధానులు” అను పదమునకు ప్రక్క ప్రక్కనే వాడబడినది. అనగా మనము స్పష్టముగా కొత్తదనమేమియూ లేని పరిభాషతో వ్యవహరించుచున్నాము.[12]

ఈ నాలుగు పదములను చేర్చుట ద్వారా, ఉనికి కలిగియున్న ప్రతి అధికారమును యేసు అధిగమించినవాడై యున్నాడనియు, ప్రతి ఒక్కటి ఆయన మీద ఆధారపడియున్నదనియు పౌలు రూఢిపర్చుచున్నాడు. ఆయన విశ్వమంతటిలోని సమస్త అత్యున్నతమైన వ్యవస్థలకును ఉనికి కలిగియున్నవాటికిని మిన్నయైనవాడై యున్నాడు. దేవదూతలు మరియు సాతాను అధికారములతో సహా, పరలోకమందలి సర్వసైన్యసమూహముల వలెనే, భూలోకమందలి అధికారములు ఆయన కంటె అల్పమైనవై యున్నవి (1 పేతురు 3:22; హెబ్రీయులకు 2:14–15; 1 యోహాను 4:4). కొలొస్సయులు ఆయనను మాత్రమే ఆరాధించవలెననియు అన్య దేవతలను గాని దేవదూతలనుగాని ఆరాధింపవలదనియు ఆదేశింపబడ్డారు (కొలొస్సయులకు 2:18–19).

**“సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను” (1:16)**

ఇహపరములు యేసు చేత సృజింపబడుట మాత్రమే కాదు, గాని అవి ఆయన నిమిత్తము సృజింపబడినవి. భౌతిక ప్రపంచమునకును దాని ఉనికికిని మూలాధారము ఆయనే.

గ్రీకు క్రియా పదము యొక్క రూపము *ektistai*, **సృజింపబడెను,** సృష్టి కార్యము ఒక నిర్ణీత సమయములో జరిగినదనియు, సృజింపబడినది యేసు ద్వారాను యేసు నిమిత్తమును దాని రూపములో కొనసాగుచున్నదనియు సూచించుచున్నది. వచనము చివరలో నున్న “సృజింపబడెను” అను పదములో నున్న (వ్యాకరణ) “కాలము సంపూర్ణమైనదై యుండి, సృజనాత్మకమైన చర్య వలని శాశ్వతమైన ఫలితమును ప్రస్తావించుచున్నది.”[13] సమస్త

సృష్టియు ఆయన మహిమ మరియు గౌరవము నిమిత్తము ఉపస్థితమై యున్నది. తండ్రి సంకల్పమేమనగా: ఆయన యొక్క సృష్టి ద్వారా యేసు ఇహపరలోకములందలి ప్రాణుల చేత హెచ్చింపబడవలెను.

**ఆయన నిమిత్తము** అను పదజాలములోని, "నిమిత్తము" అను విభక్తి ప్రత్యయము (*eis,* ప్రాథమికముగా ఈ పదమునకు "లోనికి" అని అర్థము) ఈ సందర్భములో "ఉద్దేశమును లేక లక్ష్యమును" వ్యక్తము చేయుచున్నది.[14] *Eis* యొక్క ఇదే అర్థము అపొస్తలుల కార్యములు 2:38లో కనబడుతుంది. యూదులు పాపక్షమాపణ "నిమిత్తము" మారుమనస్సు పొంది, యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెనని పేతురు చెప్పాడు. ఆయన రక్తము పాపక్షమాపణ నిమిత్తము చిందింపబడినదని యేసు సెలవిచ్చునప్పుడు ఆయన *eis* ఉపయోగించాడు (మత్తయి 26:28). యేసు సృష్టి యొక్క సంకల్పము మరియు లక్ష్యమైయున్నాడు గనుక, పాపక్షమాపణ, యేసు రక్తము చిందింపబడుట, మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుటలోని తుది సంకల్పము మరియు లక్ష్యమై యున్నది. విశ్వమంతయు క్రీస్తునందు కేంద్రీకృతమై యున్నది.

విశ్వమంతయు యేసు నిమిత్తము ఉనికి కలిగియున్నది; ఏలయనగా అది సృజింపబడినది ఆయన కొరకే. అదే విధంగా, పౌలు ఇలా రచించాడు, "ఆయన మూలమునను ఆయన ద్వారాను ఆయన [*eis* – నిమిత్తమును] సమస్తమును కలిగియున్నవి" (రోమీయులకు 11:36), మరియు "... ఒక్కడే దేవుడున్నాడు, ఆయన తండ్రి, ఆయన నుండి సమస్తమును కలిగెను, ఆయన నిమిత్తము [*eis*] మనమున్నాము; మరియు మనకు ప్రభువు ఒక్కడే, ఆయన యేసుక్రీస్తు, ఆయన ద్వారా సమస్తమును కలిగెను, మనము ఆయన ద్వారా కలిగినవారము" (1 కొరింథీయులకు 8:6). మనము తండ్రి నిమిత్తమును కుమారుని నిమిత్తమును కలిగినవారమై యున్నామని చెప్పుటలో విరుద్ధోక్తి లేదు. ఆయన వారిని తండ్రికి అప్పగించునట్లు నీతిమంతుల ఆధ్యాత్మిక స్వభావము కుమారుని చేత ఆయన మహిమ నిమిత్తము సాధ్యము చేయబడినది. గనుక ఇప్పుడు కుమారునికి చెందియుండి ఆయన రాజ్యములో ఉన్నవారు ఆయన తండ్రికి రాజ్యమును అప్పగించునప్పుడు (1 కొరింథీయులకు 15:24), చివరకు "తమ తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు" (మత్తయి 13:43).

## సమస్తమును కలిపికట్టుగా నిర్వహించువాడు (1:17)

**17ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు, ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు.**

### "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు" (1:17)

యేసు **సమస్తమునకు ముందున్నవాడను** వాస్తవమునకు, సృజింపబడిన విషయములలో ఆయన ఒక భాగము కాదని అర్థమై యున్నది. "ముందుగా" (*pro*) అను పదము కాలము మరియు శ్రేణి గూర్చిన ప్రథమ ప్రాధాన్యమునకు ఉపయోగింపబడవచ్చును. శ్రేణికి సంబంధించినంత వరకు ("అన్నిటికంటె ముఖ్యముగా"; యాకోబు 5:12; 1 పేతురు 4:8), క్రొత్త నిబంధనలో కనీసము రెండు పర్యాయములైనా, అది ఉపయోగింపబడినది. పౌలు ఈ రెండు ఉద్దేశములను ఉద్దేశించి యుండును. పౌలు యొక్క ఇదివరకటి వాదోపవాదముల ప్రకారము, యేసు అన్నిటి కంటే ముఖ్యమైనవాడును, అన్నిటికంటె ముందుగా ఉన్నవాడునై

యున్నాడు.

యేసు అన్నిటికంటె ముందు "ఉండెను" కాదు గాని, అన్నిటి కంటె ముందు "ఉన్నాడు" అని పౌలు రూఢీపర్చాడు. "ఉన్నాడు" అని వాడుట ద్వారా, యేసు అన్నిటి కంటె ముందుండుటకు కొనసాగుచున్నాడని ఆయన భావించుచున్నాడు. వర్తమాన కాలములోని "ఉన్నాడు" (*estin*) అను పదము "ఈ పూర్వస్థితము నిరాపేక్షమైన ఉపస్థితమై యున్నదని ఘోషించుచున్నది" అని జే. బి. లైట్ ఫుట్ యుక్తముగా నుడివాడు.[15] "లోకము పుట్టక మునుపు" ఆయన తండ్రితో కూడ ఉన్నాడని చెప్పుట ద్వారా యేసు ఇదే సత్యమును వ్యక్తము చేసాడు (యోహాను 17:5).

"వస్తువులు" అను పదము దాని స్వభావములో భౌతికమైనదిగా నున్న ప్రతి విషయమును, సహాయములేని మానవ కంటికి కనబడునది లేక కనబడనిదై, జీవముగలవియు జీవములేనివియునైన వాటితో సహా ప్రతి విషయమును, సూచించుచున్నది. యేసు అన్నిటికంటె ముందున్నవాడను వాస్తవమునకు, ఆయన నిత్యుడనియు సమస్తమునకు ఉన్నతమైనవాడనియు అర్థమై యున్నది. సమస్తము ఆరంభమైనప్పుడు, ఆయన అది వరకే ఉన్నాడు (యోహాను 1:1). ఆయనకు ఆరంభము లేదు గనుక ఆయన అన్నిటి కంటె ముందున్నాడు.

### "సమస్తమునకు ఆయనే ఆధారభూతుడు" (1:17)

యేసు, ఆయన కలుగజేసిన సమస్తమునకు ఆధారమై దానిని నిర్వహించుచున్నాడు. "ఆయన తన మహత్తుగల మాట చేత సర్వమును నిర్వహించుచున్నాడు" (హెబ్రీయులకు 1:3–4). **సమస్తమునకు ఆయనే ఆధారభూతుడని** పౌలు చెప్పాడు. ఉనికి కలిగియున్న సమస్తమును "దేవుని వాక్యము వలన" కలిగినవి (హెబ్రీయులకు 11:3). దేని చేతనైతే సమస్తమును సృజింపబడినదో ఆ వాక్యము, అంత్య దినమునాటి అగ్ని కొరకు భూమ్యాకాశములను నిలువచేయు అదే వాక్యమై యున్నది (2 పేతురు 3:5–7). లోకము యొక్క ఆరంభము మరియు కొనసాగుచునే ఉండి దాని ఉనికి యేసుపై ఆధారపడియుండును. ఆయన వాక్కు ద్వారా, సమస్తమును సృజింపబడెను గనుక అది నిలిచియుండుటకు కొనసాగును; ఇదే సృష్టి ఆయన వాక్కు చేత అంతమగును. ఆయన వాక్యము యొక్క శక్తి సమస్తమునకు ఆధారభూతముగా నుంటూ సమస్తమును నిర్వహించుచున్నందు వలన అది ఇప్పుడు నిలిచియుంటున్నది.

"ఆధారభూతుడు" అని అనువదింపబడిన పదము (*sunistēmi*) ఆయన కలుగజేసిన సమస్తమునకు యేసు ఆధారభూతుడై యుండుట మాత్రమే కాదు, కానీ ఇప్పుడును దానికి ఆధారభూతుడై యుండుటకు కొనసాగుచున్నాడను అభిప్రాయమును వ్యక్తముచేయుచున్నది. సమస్తమునకును ఆయన ఆధారభూతుడై యుంటునందువలన, ఈ విశాల విశ్వమంతయు అస్తవ్యస్తమైన స్థితి లేదు. సమస్తమును యేసు శక్తితో సామరస్యముగా నిర్వహింపబడుచున్నది. సృజింపబడిన విశ్వమంతయు పోషింపబడుచు నిర్వహింపబడినట్లు ఏకీకరణముచేయుచున్న శక్తి ఆయనే.

## సంఘమునకు శిరస్సు మరియు సర్వోచ్ఛమైనవాడు (1:18-20)

**[18-20]సంఘము అను శరీరమునకు, ఆయనే శిరస్సు ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియైయుండి మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను. ఆయనయందు సర్వసంపూర్ణత నివసింపవలెననియు, ఆయన సిలువ రక్తము చేత సంధిచేసి, ఆయన ద్వారా సమస్తమును, అవి భూలోకమందున్నవైనను, వాటన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధానపర్చుకొనవలెననియు తండ్రి అభీష్టమాయెను.**

ఈ సందర్భంలో, పౌలు యేసునకును విశాలవిశ్వమునకును గల సంబంధము గూర్చిన తన చర్చ నుండి ఆయన సంఘముతో కలిగియున్న సంబంధమువైపు మళ్లాడు. యేసు ఈ సమస్త సృష్టిని పరిపాలించుచున్నవాడు మాత్రమే కాదు కానీ ఆయన సంఘమును సహితము ఏలుచున్నవాడై యున్నాడు.

### "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు" (1:18)

దేవుని స్వరూపమై, సర్వసృష్టికి ఆదిసంభూతుడై, సర్వమునకు సృష్టికర్తయై యుండుటతో పాటుగా, యేసు **సంఘము అను శరీరమునకు సహితము శిరస్సై** యున్నాడు.

"ఆయన ... అయియున్నాడు" అని పౌలు ఈ సందర్భములో, నాలుగు పర్యాయములు ప్రకటించాడు (వచనం 17). యేసు, దేవుని స్వరూపమై యున్నాడు (వచనం 15), ఆయన అన్నిటికంటే ముందుగా ఉన్నవాడు (వచనం 17), శరీరమునకు శిరస్సై యున్నాడు (వచనం 18), మరియు ఆయన ఆదియై యున్నాడు (వచనం 18). యేసు "సంఘము, అనగా ఆయన శరీరమునకు" శిరస్సైయున్నాడని పౌలు ఇతర వాక్యభాగములలో ఉపదేశించాడు (ఎఫెసీయులకు 1:22, 23; 5:23). కొలొస్సీ పత్రికలో ఆయన ఈ క్రమమును తిరుగ వ్రాసాడు, "శరీరము, అనగా సంఘమునకు" శిరస్సై యున్నాడు (వచనం 18ఎ; 1:24 చూడుము – ఆంగ్లములో).

శిరస్సునకును శరీరమునకును గల సంబందము ఒక ముఖ్యమైన విషయమై యున్నది. శిరస్సు, శరీరముయొక్క కార్యకలాపములను నియంత్రించును, నిర్దేశించును, మరియు ఏలుచుండగా, శరీరము శిరస్సు యొక్క కోరికల మేరకు విధేయతతో లోబడుచుండును (ఎఫెసీయులకు 5:24). యేసు, శిరస్సై యున్నవాడు, ఆయన సంకల్పములను శరీరము ద్వారా అమలుపర్చుచు, నెరవేర్చుచుండును. ఈ శరీరము అనగా సంఘము, యేసు యొక్క మనోరథములకు అనుగుణంగా మసలుకొనుటకు నిలిచియున్నది; ఈ శరీరావయవములు ఆయన యొక్క ఇహలోక ప్రతినిధులుగా పనిచేయుచుండును. శరీరము పనిచేయుచుండవలెనని శిరస్సు కోరుచుండగా, శిరస్సు దాని కార్యకలాపములను నియంత్రించుచుండవలెనని శరీరము కోరును. శరీరము దాని సంరక్షణ మరియు సంక్షేపము కొరకు శిరస్సుపై ఆధారపడును. యేసు శరీరముతో కలిగియున్న సంబంధము అది వ్యక్తిగతమైనదై యున్నది; అది ఒక సొంతదారు తన భవంతితో కలిగియుండు సంబంధమునకు భిన్నమైనదై యున్నది. సంఘము, ఒక వ్యక్తి వలెనే, శిరస్సునకును శరీరమునకును మధ్య సరైన సహసమన్వయమున్నప్పుడు మాత్రమే అది సక్రమంగా పనిచేయుచుండును.

యేసు నాయకత్వము గూర్చి ఏ. టి. రాబర్ట్సన్ వ్రాసిన ఈ క్రింది వ్యాఖ్యానము యోచించుటకు యోగ్యమైనదై యున్నది:

> సరిగ్గా శిరస్సు శరీరమును నియంత్రించుచుండినట్లే, ఆయన తన సంఘము మీద కలిగియున్న నాయకత్వంతో దానిపై ప్రభుత్వము చేయుచున్నాడు. శరీరమునకును శిరస్సునకును మధ్య ప్రాణాధారమైనంతటి సంబంధము ఉన్నది. ఏదిఏమైనా, శరీరము, శిరస్సుకు ఉత్తరువులను జారీచేయదు. అది శిరస్సుకు నొప్పి కలుగజేయవచ్చును, తరచుగా అదే పని చేస్తుంది, కానీ ఈ పని కూడ శిరస్సు నియంత్రణలోను శిరస్సు అధికారము క్రిందను జరుగుచుండును ... ఆయన చిత్తమును నెరవేర్చుటకును, ఆయన ఆదేశములను అమలుచేయుటకును, శరీరమునకు శిరస్సు అవసరమై యున్నది, అలాగే శిరస్సునకు శరీరము అవసరమై యున్నది.[16]

శరీరము మరియు సంఘము ఒకే విధమైనవై యున్నవి. రాబర్ట్సన్ సరిగా వ్యాఖ్యానిస్తూ ఇలా చెప్పాడు, "ఇచ్చట పౌలు రెండు పదములను ప్రయోగించుచున్నాడు, 'శరీరము' (మరియు) 'సంఘము,' ఇవి వాటి వివరణలో ఒకదానితో మరొకటి పొందికగా ఉన్నవి."[17] ఇట్లు సంఘము క్రీస్తు శరీరమై, క్రీస్తు సంఘమై యున్నది.

పౌలు "శరీరము" అని రచించాడు, "శరీరములు" అని కాదు. "శరీరము" అని వ్రాయుట ద్వారా, పౌలు మనస్సులో ఒకే ఒక్క శరీరము, అనగా ఒకే సంఘమను శరీరమును గూర్చిన తలంపు ఉన్నది. ఒక శరీరాకృతిని అలంకారికముగా ఉపయోగించుచు సంఘమును సూచించుటలో, పౌలు ఎల్లప్పుడు ఏక వచనములోనున్న నామవాచకమునే ఎన్నుకొన్నాడు, బహువచనము కాదు (1 కొరింథీయులకు 12:24, 25, 27; ఎఫెసీయులకు 1:23; 4:12, 16; 5:23, 30; కొలొస్సయులకు 1:24; 2:19). లెక్కలేనన్ని సార్లు ఆయన అది ఒక్కటై యున్నదని శరీరము గూర్చి ప్రస్తావించాడు (రోమీయులకు 12:5; 1 కొరింథీయులకు 10:17; 12:12, 13, 20; ఎఫెసీయులకు 2:16; 4:4; కొలొస్సయులకు 3:15). "క్రీస్తు శరీరము" (1 కొరింథీయులకు 12:27) లేదా "ఆయన శరీరము" (ఎఫెసీయులకు 1:23; 5:30; కొలొస్సయులకు 1:24) అని రచించుట ద్వారా, క్రీస్తుశరీరమైయున్నదేదో అది సంఘమై యున్నదని పౌలు ఉపదేశించాడు. "సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" అని వ్రాయబడి యున్నట్టుగా (రోమీయులకు 16:16), బహువచనములోనున్న "సంఘములు" అను పదము సార్వత్రిక సంఘమును సూచించునది కాదు గాని, స్థానిక సంఘముల గూర్చి ప్రస్తావించుచుండిన సందర్భములో మాత్రమే ఉపయోగించబడినది.

శరీరము, సంఘమై యున్నదను భావములో ప్రాముఖ్యమైన అంతర్భావములున్నవి.

> సంఘము క్రీస్తు శరీరమైయున్నదను ఈ భావసంగ్రహణము సహాయముతో, విశ్వాసులు "క్రీస్తునందున్నారు" అనియు అదే సమయంలో క్రీస్తువారియందున్నాడనియు పౌలు మాట లాడుగలుగుచున్న తీరును మనము బహుశా చక్కగా అర్థం చేసుకోగలము. ఏలయనగా వారు ఆయన శరీరావయవములు, "క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది" (గలతీయులకు 3:27), "క్రీస్తునందున్నారు"; ఆయన వారియందున్నాడు ఏలయనగా వారిని చైతన్యవంతులను చేయునది ఆయన జీవమే. యోహాను 15:1నుండి ఆ తరువాత వచనములో గల మరొక అంగరచన సంబంధమైన సాదృశ్యము ఉపయోగించుకొనబడిన విషయమును మనము పోల్చి చూడవచ్చును; తీగెలు ద్రాక్షావల్లిలో ఉన్నాయి మరియు అదే సమయంలో ద్రాక్షావల్లి తీగెలలో ఉన్నది.[18]

"శరీరము" (*sōma*) అను పదము కొంతమంది గల ఒక గుంపు లేక ఒక ప్రజా ప్రమాణికాంశమును భావముతో వాడబడినది, ఉదాహరణకు "విద్యార్థి సంఘము" మరియు "శాసన సభ" మొదలైన పదజాలములు పనులు చేయుచున్న సభ్యుల ప్రమాణికాంశములను సూచించుచున్నవి. సంపూర్ణ శరీరము సక్రమంగా పనిచేయుటకు సహాయపడగల సామర్థ్యములు కలిగియున్న ప్రతి ఒక్క అవయవము సంఘటితము చేయబడిన ఒక్క ప్రమాణికాంశమై యున్నదని పౌలు సంఘమును మానవ శరీరముతో పోల్చాడు (రోమీయులకు 12:4, 5; 1 కొరింథీయులకు 12:12, 13).

క్రొత్త నిబంధనలో "సంఘము" (*ekklēsia*) అను పదము కొందరు ప్రజలున్న ఒక గుంపును సూచించుచున్నది, కానీ ఎన్నడును ఒక కట్టడమును కాదు. ఈ పదము క్రైస్తవ ప్రపంచము యొక్క పదసంపదకు పరిచయము చేయబడక మునుపు, *ekklēsia* ఒకగ్రీకు సమాజములో నియమానుసారంగా కూడుకొనుటకు పిలుపు ఈయబడిన రాజకీయ సభను – నగర సమితిని – సూచించుటకు ప్రయోగింపబడనది. క్రొత్త నిబంధనలో అది యేసును వెంబడించుచుండిన గుంపంతటిని (మత్తయి 16:18), స్థానిక క్రీస్తు సభలను (రోమీయులకు 16:16), ఒక ప్రాంతములోని సంఘములను (1 కొరింథీయులకు 16:1), సభలుగా సమావేశమగుచుండిన క్రైస్తవులను (1 కొరింథీయులకు 14:23), సమావేశముగా కూడుకొనిన సభ్యులను (అపొస్తలుల కార్యములు 8:1), మరియు మత సంబంధములేని సమావేశమును (అపొస్తలుల కార్యములు 19:32, 39, 41) సూచించుటకు వాడబడినది. కొలొస్సయులకు 1:18లో "సంఘము" అను పదము కొలొస్సీ పత్రికలో మొదటిసారి కనిపించుచున్నట్లు మనము గమనించగలము. ఇచ్చట, 24వ వచనములో వలెనే, ఒక నిర్దిష్టమైన సభకాదు కానీ యేసును వెంబడించుచుండినవారందరు అని అర్థమిచ్చుచున్నది. అటు తరువాత, స్థానిక సభల గూర్చి ప్రస్తావించుచు పౌలు, ఈ పదమును రెండు పర్యాయములు ప్రయోగించాడు (కొలొస్సయులకు 4:15, 16).

యేసు సంఘముతో కలిగియుండిన సంబంధము దాని ప్రాముఖ్యతను బయలుపర్చుచున్నది. ఆయనే దానిని కట్టుచున్నవాడును, సొంతదారుడును (మత్తయి 16:18), దానిని కొనువాడును (అపొస్తలుల కార్యములు 20:28), దాని పునాదియు (1 కొరింథీయులకు 3:11), దాని శిరస్సు (ఎఫెసీయులకు 1:22, 23), మరియు రక్షకుడునై (ఎఫెసీయులకు 5:23) యున్నాడు. దేవుడు సంఘము ద్వారా తన జ్ఞానమును వెల్లడిపర్చాడు (ఎఫెసీయులకు 3:8–11). యేసు దానిని పరిశుద్ధమైనదిగాను నిర్దోషమైనది గాను తన యెదుట నిలువబెట్టుకొనును (ఎఫెసీయులకు 5:25–27).

సంఘము యేసుకు చెందియున్నది ఎందుకనగా ఆయనే దానిని తన స్వరక్తమిచ్చి సంపాదించుకొన్నాడు. ఈ హేతువునుబట్టియే దానిని "క్రీస్తు సంఘములు" అనియు (రోమీయులకు 16:16) లేదా యేసు, దేవుడై యున్నందునుబట్టి (యోహాను 1:1, 2) "దేవుని సంఘము" (1 కొరింథీయులకు 1:2) అనియు పిలువవచ్చును. ఒక సభ, ఫలానా పట్టణమునకు సంబంధించిన సంఘమని గుర్తింపబడవచ్చును, ఉదాహరణకు "యెరూషలేములోని సంఘము" (అపొస్తలుల కార్యములు 8:1). సమాజములోని ఏదైన ఒక విభాగమునకు చెంది సంఘములను, ఉదాహరణకు "అన్య జనుల సంఘములు" (1 రోమీయులకు 16:4), మరియు ఏదైన ఒక ప్రాంతములో నున్న సంఘములను,

ఉదాహరణకు "గలతీయలో నున్న సంఘములు" (కొరింథీయులకు 16:1) అని సూచించుటలో నున్న బైబిలు సంబంధమైన అధికారమును సహితము మనము చూడగలము. ఇతరమైన బైబిలు సంబంధ పదజాలములలో "పరిశుద్ధుల సంఘములు" (1 కొరింథీయులకు 14:33), "జీవముగల దేవుని సంఘము" (1 తిమోతి 3:15), "జేష్ఠుల సంఘము" (హెబ్రీయులకు 12:23) కూడ చేరియున్నవి. అపొస్తలుల కార్యములు 5:11 "సంఘము" అని మామూలుగా ప్రస్తావించుచున్నది.

సంఘము "పరలోక రాజ్యమై" యున్నది (మత్తయి 16:18, 19). అది "మందయై" యున్నది (అపొస్తలుల కార్యములు 20:28), అది "ఆయన శరీరమై" యున్నది (ఎఫెసీయులకు 1:22, 23), మరియు "దేవుని మందిరమై" యున్నది (1 తిమోతి 3:15). క్రీస్తు శరీరములోని సభ్యులు, అనగా సంఘము, రాజ్యమునకు సంబంధించిన పౌరులై యున్నారు (ఎఫెసీయులకు 2:19), వారు మందలోని గొఱ్ఱెలై యున్నారు (యోహాను 10:16), మరియు దేవుని పిల్లలు, ఆయన కుటుంబ సభ్యులై యున్నారు (గలతీయులకు 3:26, 27). సంఘము, యేసు మరణమునుబట్టి పరిశుద్ధపరచ బడినవారందరును గల సభయై యున్నది. బాప్తిస్మమునుబట్టి దానిని పొందినవారు దేవుని రాజ్యములోనికి (యోహాను 3:5), ఒకే శరీరము లోనికి (1 కొరింథీయులకు 12:13), అనగా సంఘము లోనికి (1 తిమోతి 3:15) ప్రవేశపెట్టబడుదురు. జీవగ్రంథములో పేర్లు వ్రాయబడినవారు పరలోక రాజ్యములో నమోదు చేయబడియున్నారు (హెబ్రీయులకు 12:23; ప్రకటన 21:27). వారు ఆ "పరిశుద్ధ పట్టణము" లోనికి ప్రవేశించుదురు (ప్రకటన 21:2, 10; 22:19 చూడుము).

సంఘము యొక్క పరలోక సంబంధమైన గమ్యము బైబిలు సంబంధమైన అనేక ప్రకటనల నుండి నిర్ణయింపబడినది. యేసు రాజ్య సంబంధులైన కుమారులు తండ్రి రాజ్యములో సూర్యుని వలె ప్రకాశించుదురు (మత్తయి 13:37-43). యేసు తన మందలోని గొఱ్ఱెలకు నిత్యజీవము నొసగును (యోహాను 10:27, 28). శరీరమునకు ఆయనే సంరక్షకుడై యున్నాడు (ఎఫెసీయులకు 5:23). దేవుని పిల్లలముగా, మనము వారసులమై యున్నాము (రోమీయులకు 8:16, 17; గలతీయులకు 4:7). మన స్వాస్థ్యము మన కొరకు పరలోకములో భద్రము చేయబడియున్నది (1 పేతురు 1:3, 4).

యేసు క్రీస్తుకు లోబడువారు ఆయన సంఘములో అంగీకరింపబడదగు సభ్యులై యున్నారు (ఎఫెసీయులకు 5:24). విశ్వాసపాత్రమైన క్రైస్తవుడు క్రీస్తు యెడల కలిగియున్న ప్రేమ మరియు భయమునుబట్టి ఆయనకు నిర్మాణాత్మకముగా ప్రతిస్పందించును (యోహాను 14:15, 21, 23; ఫిలిప్పీయులకు 2:12; 1 పేతురు 1:17). "ఒకడు నన్ను సేవించిన యెడల, నన్ను వెంబడింపవలెను; అప్పుడు నేను ఎక్కడ ఉందునో, అక్కడ నా సేవకుడును ఉండును; ఒకడు నన్ను సేవించిన యెడల, నా తండ్రి అతని ఘనపర్చును" అని యేసు చెప్పాడు (యోహాను 12:26).

### "ఆయన ఆదియైయుండి మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను" (1:18)

**ఆయన ఆదియైయుండి మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడాయెనని** పౌలు

రచించాడు. 15వ వచనం ప్రకారం, యేసు "ఆదిసంభూతుడై యున్నాడు" అని పౌలు సూచించుచున్నట్లు తెలియుచున్నది ("ఆదిసంభూతుడు" మరియు "ఆదియైయున్నాడు" గూర్చిన మరిన్ని వివరములకు 1:15పై గల చర్చను చూడుము). అంతకు మునుపు, "సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు" అని చెప్పాడు; ఈసారి "మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడై యున్నాడు" అని చెప్పుచున్నాడు (ప్రకటన 1:5 చూడుము).

మృతులలో నుండి లేపబడినవారిలో యేసు మొదటివాడు కాదు. సారెపతు విధవరాలి కుమారుని ఏలీయా లేపాడు (1 రాజులు 17:21, 22). షూనేమీయురాలి కుమారుని ఎలీషా సజీవునిగా చేసాడు (2 రాజులు 4:34-36). ఎలీషా సమాధిలోని ఎముకలకు తగిలినవాడు మరలా బ్రతికాడు (2 రాజులు 13:20, 21). యేసు యాయీరు కుమార్తెను (మార్కు 5:22, 35-42), నాయీను విధవరాలి కుమారుని (లూకా 7:11-15), మరియు లాజరును (యోహాను 11:43, 44) మృతులలో నుండి లేపాడు. వీరందరు యేసునకు ముందుగా లేపబడ్డారు. మృతులలోనుండి లేపబడినవారిలో యేసు మొదటివాడు కానప్పటికిని, ఆయన అత్యంత ప్రాముఖ్యమైనవాడై యున్నాడు. ఈ భావము చొప్పున, ఆయన మృతులలో నుండి లేపబడినవారందరిలో "ఆదిసంభూతుడై" యున్నాడు. ఆయన ఇక ఎన్నటికిని మరణించనివానిగా మృతులలో నుండి మొదట లేపబడ్డాడు (1 కొరింథీయులకు 15:22, 23). ఆయన మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడై యుండుటద్వారా, అదే ప్రకారము ఇతరులు సహితము లేచునట్లు వారి కొరకు ఆయన మార్గమును సరాళము చేసాడు (రోమీయులకు 6:8).

మృతులలో నుండి లేపబడినవారిలో యేసు కాలక్రమ వృత్తాంతము ప్రకారము మొదటివాడని భావించుటకు బదులుగా, పౌలు యేసు ప్రాముఖ్యతను నొక్కివక్కాణించుచుండెను. "మృతులలో నుండి" అనగా, ఆయన మృతులలోనుండి ప్రాముఖ్యత గల తన స్థానమునకు వచ్చాడను భావము ధ్వనించుచున్నది. పెంతెకొస్తు దినాన ఈ సత్యము గూర్చి పేతురు ప్రసంగించాడు. ఆయన ఆరోహణమైప్పుడు సమస్తమును ఏలునట్లు (ఎఫెసీయులకు 1:20-23; 1 పేతురు 3:22), యేసు దావీదు సింహాసనముపై ఆసీనుడగుటకు మృతులలో నుండి లేపబడ్డాడు (అపొస్తలుల కార్యములు 2:29-31).

యేసునకు సంఘముపై నున్న ప్రధానత్వము, విశాల విశ్వములో సృష్టింపబడిన సర్వముపై ఆయన కలిగియున్న ప్రాముఖ్యతపై ఆధారపడియున్నది. ఆయన విశాల విశ్వమంతటికి మాత్రమే శిరస్సు కాదు గాని సంఘమునకు సహితము శిరస్సై యున్నాడు. ఇప్పుడాయన సృష్టిలోని సకల వ్యవస్థలను పరిపాలించుచున్నాడు.

### "ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము … ఆదిసంభూతుడాయెను" (1:18)

**ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము … ఆదిసంభూతుడాయెను** అని చెప్పుచు పౌలు ముందుకు సాగుచున్నాడు. "అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము" (*prōteuō*) అను పదజాలము క్రొత్త నిబంధనలో ఇచ్చట మాత్రమే అగుపించును. ఏదిఏమైనా, అది దాని విశేషణ రూపంలో (*prōtos*) అనేక పర్యాయములు వాడబడినది. ఈ పదమునకు "మొదటి" అర్థము మరియు అది ప్రోటోన్ ("proton") అను ఆంగ్ల పదమునకు మూలమై

యున్నది. యేసు ప్రాముఖ్యత అంతర్జనితమైనది మాత్రమే కాదు గాని అది పునరుత్థానము ద్వారా ఉత్పన్నమైనదై యున్నది. మృతులలో నుండి లేపబడినవారిలో యేసు మొదటివాడును ప్రాథమికవాడునై యున్నందునుబట్టి, మృతులలో నుండి లేపబడనైయున్న ఇతరులందరి కంటె మిన్నయైన స్థానమును కూడ కలిగియున్నాడు. మరణముపై ఆయన సాధించిన విజయమునుబట్టి, ఆయన జీవమునకు మూలాధారమయ్యాడు. సకల శత్రువులను జయించినవానిగా (హెబ్రీయులకు 2:14), ఆయన ఇప్పుడు ఇతరులందరికంటె మిన్నయైన స్థానములో ఉన్నాడు గనుక శత్రువులలో నుండి ఆయనకు ప్రత్యర్థిగా ప్రవర్తించగలవాడెవడును లేడు. ఆయన కొరకు జీవించువారందరికి ఆయన మరణముపై విజయమునీయగలడు (1 కొరింథీయులకు 15:55–57).

యేసు పరలోకమునకు ఆరోహణమైనప్పుడు, ఆయనకు ఇహలోకములందలి సమస్త అధికారముపై ఆయన ఉంచబడ్డాడు. ఇప్పుడాయనకు పరలోకమందును భూమిమీదను సర్వాధికారము కలదు.[19] యేసు అధికారము క్రింద లేని ఒకే ఒక్కడు – తండ్రి, ఆయన సమస్తమును యేసు అధికారము క్రింద ఉంచియున్నాడు (1 కొరింథీయులకు 15:27). యేసు సర్వమును పరిపాలించుచున్నప్పటికిని, కొందరు శత్రువులు యింకను ఆయన చేత అణగద్రొక్కబడలేదు (1 కొరింథీయులకు 15:25, 26).

**"అది తండ్రి అభీష్టమాయెను" (1:19)**

పౌలు యేసు నందు నివసించుచున్న సంపూర్ణత గూర్చి మాటలాడుచు అది **తండ్రి అభీష్టము ...** అనియు/నిమిత్తము అంటూ వివరించాడు. "... అనియు"/"నిమిత్తము" (*hoti*) అను పదము "ఎందుకనగా" అని అర్థమిచ్చునట్లు కూడ అనువదింపబడి, ఈ వచనమునకును యేసు గూర్చి 16 మొదలుకొని 18 వరకు గల వచనములలో చెప్పబడిన విషయమునకును సంబంధము కలుపుచున్నది. "అభీష్టము" (*eudokeō*), లేక "ఆనందించెను" అనునది, యేసు బాప్తిస్మము పొందిన సందర్భములోను, యేసు రూపాంతరము చెందిన సమయంలోను, ప్రవక్తయైన యెషయా పలికిన మాటలను ఉల్లేఖనముగా సెలవిచ్చుచు, ఆయన ఆనందించుచున్నాడని తండ్రి పలికినప్పుడు వాడబడిన అదే క్రియాపదమై యున్నది (మత్తయి 3:17; 12:18; 17:5).

అత్యున్నతముగా హెచ్చింపబడిన స్థానమును తండ్రి యేసునకు అనుగ్రహించుట ద్వారా తన నిత్య సంకల్పమును నెరవేర్చాడు. ఈ హెచ్చింపును యేసు తన తండ్రి నుండి బలవంతముగా తీసికొనవలెనని ఆశించుటలేదు (ఫిలిప్పీయులకు 2:6), కానీ ఆయన దానిని కృపాసహితముగా తండ్రినుండి పొందుకొన్నాడు. యేసు తన తండ్రి చిత్తమును నెరవేర్చుటకు ఇహమునకు అరుదెంచాడు, ఏలయనగా సంకల్పము సందర్భములో ఆయన మరియు తండ్రి ఒకటే అయియున్నారు (యోహాను 10:30). యేసు చేసిన సమస్త పనులలోను ఆయన యొక్క ప్రేరేపణ తండ్రి చిత్తమునకు లోబడవలెననునదే (యోహాను 4:34; 5:30; 6:38; హెబ్రీయులకు 10:9). యేసు సిలువపై మరణించుట ద్వారా చూపిన ఇష్టపూర్వకమైన విధేయతనుబట్టి, తండ్రి "ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించాడు" (ఫిలిప్పీయులకు 2:9–11).

యేసు మరియు ఆయన పిల్లల ద్వారా, తండ్రి "తన దయాసంకల్పము నెరవెర్చుటకై

వారిలో కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు" (ఫిలిప్పీయులకు 2:13). అలాగని, ప్రతి సంఘటనను కలుగజేయువాడు దేవుడే అని దీని అర్థము కాదు. ఎంపిక చేసికొనగల హక్కును ఆయన ప్రతి ఒక్కరికిని అనుగ్రహించును (యెహోషువ 24:15), ఇదే విషయాన్ని ఆయన గెత్సేమనే తోటలో ప్రార్థించినప్పుడు తన యిష్టమును నెరవేర్చుకొనుటకు స్వేచ్ఛాచిత్తము కలిగియుండెనని యేసు ప్రస్తావించుట ద్వారా స్పష్టంగా సూచించాడు (మత్తయి 26:39).

### "ఆయన యందు సర్వసంపూర్ణత నివసింపవలెననియు" (1:19)

**సర్వసంపూర్ణత ఆయన యందు నివసించుట** దేవుని చిత్తము, లేక అభీష్టమై యుండెను. "నివసించుట" (*katoikeō*) అను పదము వర్తమానకాలములో నున్న అనంతమైన రూపముగలదై యున్నది, ఈ సంపూర్ణత నివసించుటకు కొనసాగుచుండునని దీని అర్థము. యేసు యొక్క ఇహలోక నివాసము "నివసించెను" అను పదము ద్వారా వ్యక్తము చేయబడినది (యోహాను 1:14), ఒకసారి నివసించి జరిగిపోయిన విషయమును సూచించుచు ఇదొక నిర్ణీతం కాని కాలము యొక్క రూపమై యున్నది. యేసు నందు నివసించు సంపూర్ణత ఒకసారి సంభవించి అంతటితో అంతమైపోవు సంపూర్ణత కాదు, అది కొనసాగుచుండు స్వభావము గల సంపూర్ణతయై యున్నది.

*Plērōma* అను గ్రీకు పదము నుండి ఉత్పన్నమైన "సంపూర్ణత," యోహాను 1:16లోను ఎఫెసీయులకు 1:23; 3:15–18; 4:13లోను ఉన్న సంపూర్ణతగా ఇచ్చట ప్రయోగింపబడినది. అటుతరువాత కొలొస్సీ పత్రికలో, పౌలు మరలా ఇదే అంశాన్ని ప్రస్తావించుచు యేసు క్రీస్తునందున్న సంపూర్ణత యొక్క నిశ్చితమైన ఒక కోణాన్ని ఉద్ఘాటించి చెప్పాడు: "ఏలయనగా దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది" (కొలొస్సయులకు 2:9). యేసునందు రక్షణ, పునరుత్థానము, సర్వాధికారము, శక్తి, మరియు తండ్రి ప్రత్యక్షత కలవు. ఇంకా మానవాళి గూర్చిన దేవుని సకల సంకల్పముల సంపూర్ణతయు, తండ్రి యొక్క స్వభావమునకు సంబంధించిన సంపూర్ణ ప్రాతినిధ్యమును ప్రస్తుత కాలములో కూడ ఆయనలో కొనసాగుచునే యున్నవి.

యేసునందు తండ్రి యొక్క దైవికమైన సంకల్పము సాధింపబడినది. మానవాళి యేసు తప్ప మరొక సృష్టికర్త, ప్రభువు, ఉపదేశకుడు, ధర్మశాస్త్రము నిచ్చువాడు, లేక రక్షకుడు లేడు. సృజింపబడిన సమస్తముతో ఆయనకు గల సంబంధము విషయంలో, యేసు సర్వమునైయుండి అందరిలోను ఉన్నవాడునై యున్నాడు. సృష్టికి సంబంధించిన దేవుని సమస్త సంకల్పములు యేసులో సంపూర్ణముగా సంపూర్తియైనవి. ఆయన సిలువ మీద శ్రమనొందుట ద్వారా, మానవాళి రక్షకుడుగా ఆయన సంపూర్ణసిద్ధినొంది పరిపూర్ణుడు గావింపబడ్డాడు (హెబ్రీయులకు 5:9). ఇంతేగాక, ఆయనయందు దేవుని సర్వశక్తియు, దేవత్వము యొక్క స్వభావమును నివసించుచున్నవి, అవి పలుచనచేయబడక సంపూర్ణముగా ఆయన యందు వెల్లడి చేయబడినవి. యేసునందు ఏ గుణగణమైనను కొదువలేదు.

తద్వారా ఆయన భూనివాసులందరి ప్రతి అవసరమును తీర్చుచున్నాడు, గనుక సర్వ సంపూర్ణత యేసు నందే నివసించునట్లు దేవుడు ఏర్పాటు చేసాడనునది విదితముగా నున్నది. కొలొస్సయులు యేసును మినహాయించి మరెవరి వైపునకైనను మళ్లవలసిన అవసరం వారికి లేకుండినది. ఇదే సత్యము ఈనాటి ప్రజలకును యుక్తముగా వర్తించుచున్నది. వారికి రక్షణ

కావలసియున్నట్లయితే, చాలునంత సమకూర్పును యేసు అనుగ్రహించును. వారికి ఆధ్యాత్మిక సహాయము అవసరమైయున్నట్లయితే, యేసే వారి సహాయకుడు. వారికి ఉపదేశము అవసరమై యున్నట్లయితే, యేసుగాక ఉత్తమ ఉపదేశకుడు మరొకడు లేదు. మానవునికి ఆయన తప్ప మరొక రక్షకుడు (అపొస్తలుల కార్యములు 4:12) మరియు మధ్యవర్తి (1 తిమోతి 2:5) లేడు. ఒక మధ్యవర్తిగా, ఆయన దేవుని నుండి వేరైన మానవునికిని దేవునికిని మధ్య సమాధానమును సమకూర్చుచున్నాడు. క్రైస్తవుల కొరకైన సర్వసంపూర్ణత యేసునందే నివసించుచున్నది. "ప్రజలు వారి సంపూర్ణతను క్రీస్తు నందు మాత్రమే కనుగొనునట్లు వారిని నడిపించునట్లు నాయకత్వము వహించుట ఉపదేశకుని బాధ్యతయై యున్నది: "*ఈ ఉపదేశకుడు తన ప్రజలకిచ్చుటకు క్రీస్తును మించి వానిలో మరేమియు లేదు.*"[20]

యేసును విడిచిపెట్టి మరెక్కడైనను వారి ఆధ్యాత్మిక అవసరముల గూర్చి సంతృప్తి నొందవలెనని వెదకుచుండు సంఘములు ఈ అవసరములను తీర్చగల ఒక్కడే అయియున్న వాని నుండి దారి తప్పిపోయి సుదూర స్థలములలో సంచరించుచున్నవి. వారు సమస్తమునకు చాలిన మూలాధారమును వదిలిపెట్టి దేనికిని చాలని ఆధారాలవైపు తిరుగుచున్నారు. ఇశ్రాయేలు ప్రజలు జీవము గల దేవుని విడిచిపెట్టి నిర్జీవమైన విగ్రహముల తట్టు తిరిగినప్పుడు, యిర్మీయా ఇలా విలపించాడు, "నా జనులు రెండు నేరములు చేసియున్నారు: జీవజలముల ఊటనైన నన్ను విడిచి యున్నారు, తమ కొరకు తొట్లను, అనగా బద్దలై నీళ్ళు నిలువని తొట్లను, తొలిపించుకొనియున్నారు" (యిర్మీయా 2:13).

యేసుకు వెలుపల, సంపూర్ణత మరెక్కడైనను లభించదు. క్రీస్తునందు విశ్వాసముంచినవారు దేవునితో వారికి గల సంబంధమును సంపూర్తి చేసికొనుటకు అవసరమైయున్న సమస్తము యేసునందే అందుబాటులో నున్నది. పౌలు ఈ వాక్యభాగములోను, "ఆయన యందు మీరును సంపూర్ణులై యున్నారు" అని కొలొస్సయులకు 2:10లో రచించుట ద్వారాను దీనికి పునాది వేసాడు.

## దేవునితో సమాధానపడుటకు గల ఆధారము (1:20)

**20... ఆయన సిలువ రక్తముచేత సంధిచేసి, ఆయన ద్వారా, సమస్తమును, అవి భూలోకమందున్నవైనను పరలోకమందున్నవైనను, వాటన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధానపరుచుకొనవలెననియు ...**

### "వాటన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధానపరచుకొనవలెననియు" (1:20)

దేవుని సర్వసంపూర్ణత క్రీస్తు నందే కలదని నుడివిన తదుపరి, యేసు ద్వారా తండ్రి సమాధానమును సాధ్యము చేసియున్నాడను అభయమును పౌలు కలుగజేయుచున్నాడు. **"వాటన్నిటిని ఆయనద్వారా తనతో సమాధానపరుచుకొనవలెననియు"** అను మాటల్లో రెండు సత్యములు ధ్వనించుచున్నవి: (1) పాపమునుబట్టి, మానవాళి దేవుని నుండి వేరై అన్యాక్రాంతము గావింపబడినదై యున్నది, మరియు (2) యేసు క్రీస్తు ద్వారా స్నేహపూర్వకమైన ఒక సంబంధమును సాధ్యము చేసినవాడు దేవుడే. పాపము మానవునికిని దేవునికిని మధ్య ఒక అగాధమును సృష్టిస్తుంది లేక ఒక అడ్డు గోడను నిర్మిస్తుంది. అది

మానవున్ని దేవుని నుండి వేరు చేస్తుంది, ఆయనతో గల సంబంధమును తెంచివేస్తుంది, మరియు వానిని ఆయన శత్రువుగా చేస్తుంది (యెషయా 59:1, 2; ఎఫెసీయులకు 2:12, 13; యాకోబు 4:4). సకల మానవులు దేవునితో సమాధానపడి ఆయన స్నేహితులుగా మారవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఒకడు దేవుని స్నేహితుడని పిలువబడునట్లు వాని విశ్వాసము మరియు క్రియలు పరిణమించినవని చెప్పుటకు అబ్రాహాము ఒక ఉదాహరణమై యున్నాడు (యాకోబు 2:22, 23).

సమాధానము క్రీస్తు యొక్క సంపూర్ణతలో సమకూడియున్నదని స్పష్టమగుచున్నది. దేవుని అభీష్టము చొప్పున ఇది ఏర్పాటు చేయబడినది. హే ఇలా వ్రాయుచున్నాడు,

> 20 వచనములో నున్న హద్దులేని "సమాధానపరుచుకొనవలెననియు" అను మాటలు వ్యాకరణ రీత్యా ... ఇవే వచనములలో నున్న "నివసింపవలెననియు" అను మాటలకు సమాంతరముగా నున్నవి, ఈ రెండు కలిసి "అభీష్టమాయెను" అను మాటల్లోని భావమును సంపూర్తి చేయుచున్నవి. దేవుడు, దేవుని సర్వసంపూర్ణతయందు కుమారునిలో నుండుటకును కుమారుని ద్వారా కార్యమును సఫలీకృతము చేయుటకును సంతోషించాడు. కొన్ని గణనీయమైన తారతమ్యములున్నప్పటికిని, సూత్రీకరణము 2 కొరింథీయులకు 5:19కి బహు దగ్గరగా నున్నట్లు గోచరమగుచున్నది, "దేవుడు ... క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరుచుకొనుచుండెను." "సమాధనపర్చుకొనుట" అను పదమునకు సంబంధించిన క్రియాపదము భిన్నమైనదై యున్నది; నిజముగా, 1:20లో వాడబడిన పదము (గ్రీకులో: *apokatalassein*) అంతకు పూర్వపు గ్రీకు సాహిత్యములో మరెక్కడైనను కనబడదు గనుక పౌలు 2 కొరింథీ 5:18–19 మరియు రోమీయులకు 5:10లో (గ్రీకులో: *katalassein*) ప్రయోగించుచున్న పదముల నుండి కొత్తగా సృష్టింపబడి యుండును.[21]

"సమాధానపరుచుకొనుట" అనగా వారు స్నేహితులై యుండునట్లు, రెండు పక్షములకు సంబంధించినవారిని వేరుచేయు అడ్డంకులను తొలగించుటయని అర్థము. మానవాళి పాపమును సిలువపై, సహించి, పాపమను అడ్డంకిని తొలగించుట ద్వారా, దీనిని సాధ్యం చేయడానికి యేసు ఆయన చేయాల్సిన కార్యమును చేసి ముగించాడు (1 పేతురు 2:24). గనుక దేవునితో సమాధానపడునట్లు యేసు చిత్తప్రకారము జీవించుట మానవుని బాధ్యతయై యున్నది. దేవుడు మానవున్ని క్రీస్తులో కలిసికొనుచున్నాడు, ఏలయనగా సమాధానపర్చబడుట అక్కడే సాధ్యమవుతుంది (2 కొరింథీయులకు 5:19). పాపశాపమును యేసు తానే భరించి మానవాళి నిమిత్తము పాపమయ్యాడు (గలతీయులకు 3:13–14; 2 కొరింథీయులకు 5:21). కాబట్టి తరువాత చర్య తీసుకొనుట వాని వాని బాధ్యతయై యున్నది: దేవునితో సమాధానపడునట్లు వాడు క్రీస్తునందుండవలెను (2 కొరింథీయులకు 5:20; గలతీయులకు 3:26, 27). మానవుడు దేవునితో సమాధానపరచబడవలసిన తన కార్యమును దేవుడు యేసుక్రీస్తు ద్వారా సంపూర్తి చేసాడు. దీనిని మించి ఆయన ఇక ఏమియు చేయడు.

ఆదాము మరియు హవ్వ చేసిన పాపము ఆధారంగా మానవ జాతి దేవుని నుండి వేరు చేయబడలేదు. దేవుని నుండి వేర్పాటును మనకై మనమే కొనితెచ్చుకొన్నాము (ఆదికాండము 3:23, 24). బిడ్డలు మంచి గూర్చి ఏమియు ఎరుగకయే వారు ఈ లోకములోనికి జన్మించుదురు (ద్వితీయోపదేశకాండము 1:39). తప్పొప్పుల విషయంలో

వారు అంధులై యున్నందువలననే, వారు పాపము లేనివారై యున్నారు (యోహాను 9:41). పరలోకరాజ్యము వారిదే (మత్తయి 19:14). ప్రతి ఒక్కడు తన సొంత పాపములను బట్టి దేవునినుండి వేరైపోయి యున్నాడు (యెషయా 59:1, 2; యాకోబు 1:14). ఆయన తన ప్రజలను వారి పాపములనుండి రక్షించుటకు యేసు ఈ లోకమునకు వచ్చాడు (మత్తయి 1:21). "మీరు మారుమనస్సు పొంది మీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని" పేతురు ప్రజలకు తెలియజెప్పాడు (అపొస్తలుల కార్యములు 2:38), "... బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని" పౌలు ఆదేశింపబడ్డాడు (అపొస్తలుల కార్యములు 22:16). ఆదాము యొక్క పాపము లేదా ఆదాము నుండి సంప్రాప్తమైన పాపము క్షమింపబడునట్లు ఒకడు ఏదైనా చేయవలెనని ఎవడైనను ఎన్నడైనను ఆదేశింపబడలేదు.

1:6, 23కు సంబంధించినంత వరకు, "సమస్తము" అనగా ఈ విశాల విశ్వములోని సాధ్యమైన ప్రతి విషయము అని అర్థము కాదు. గ్రీకులో, "సమస్తము" అని అర్థమిచ్చు విశేషణము *panta* మాత్రమే కనిపించును. "వస్తువులు" అను పదము గ్రీకు పాఠ్యభాగములో అగుపించదు, కానీ పదము యొక్క రూపమునుబట్టి అది ఆ విధంగా భావింపబడుచున్నది.

"సమస్తము" అను పదములో భౌతిక ప్రపంచము, జంతువులు, లేక ఇతర జీవులు చేరియుండవు, ఏలయనగా అవి దేవుని నుండి తమ్మునుతాము వేరుచేసుకొనుటకు ఏమియు చేయలేదు. వారి పాపములు వారిని దేవుని నుండి వేరు చేసిన "వారందరు" అని పౌలు భావించియుండవచ్చును గనుక వారు ఈ హేతువునుబట్టి సమాధానపరచవలసిన అవసరములో ఉన్నారు. దేవునితో సరైన సంబంధముగలవారిని ఆయనతో సమాధానపరచుటకు యేసు రాలేదు (మత్తయి 9:13), కానీ "నశించిన దానిని వెదకి రక్షించుటకు" వచ్చాడు (లూకా 19:10). ఈ విశాల విశ్వమంతటిలోను, దేవునితో సమాధానపరచబడుట అవసరమై యున్నవారు మరియు అట్టి సమాధానము అనుగ్రహింపబడగల జీవులు మానవులు మాత్రమే. "సమస్తము" అని చెప్పినప్పుడు, యేసు ఎప్పుడైనాగాని జీవించుచున్న వారందరు సమాధానపరచబడునట్లు సాధ్యము చేసాడని అర్థమీయవచ్చును.

"సమస్తము" అను మాట "సార్వత్రిక రక్షణ" అని అర్థమిచ్చునట్లు బలవంతము చేయుటకు కొందరు వెదకుచున్నారు. ఎటువంటి షరతులు లేకుండానే ప్రతి ఒక్కరు దేవునితో సమాధనపరచబడుదురని పౌలు భావించలేదు. సమాధానపరచబడుట యేసు ద్వారానే సాధ్యము చేయబడినది, కానీ అట్టి సమాధానమును పొందుకొనుటకు ప్రతి ఒక్కరు ప్రతిస్పందించాల్సిన అవసరమున్నది. కొరింథీయులు దేవునితో సమాధానపరచబడవలెనని పౌలు వారిని బ్రతిమలాడాడు (2 కొరింథీయులకు 5:18–20). ఆయనకు విధేయులైనవారిని యేసు రక్షించును (హెబ్రీయులకు 5:9). అవిధేయులైనవారికి ఆయన నిత్య దండనను నియమించును (2 థెస్సలొనీకయులకు 1:6–8). రెండు వెవ్వేరు గమ్యములున్నవని యేసు తెలియజెప్పాడు: "నాశనము" మరియు "జీవము" (మత్తయి 7:13–14); "నిత్యశిక్ష" మరియు "నిత్యజీవము" (మత్తయి 25:46); "జీవపునరుత్థానము" మరియు "తీర్పు పునరుత్థానము" (యోహాను 5:39).

సార్వత్రిక రక్షణ గూర్చిన అబద్ధ సిద్ధాంతము ఉపదేశింపబడుట సంఘ రచనల ద్వారా ఆదియందే ఆరంభమయ్యింది. "సర్వము సార్వత్రికము అని ప్రబోధించిన క్రైస్తవులలో ఓరిగెన్ మొదటివాడై యుండవచ్చును. ఆయన తన యౌవ్వన కాలములో రచించిన *De Principiis*

లో అందరి కొరకైన సార్వత్రిక, అంతిమ పునరుద్ధరణ అను ఆలోచనను వ్యక్తం చేసాడు."[22]

### "... ఆయన సిలువ రక్తముచేత సంధిచేసి ... అవి భూలోకమందున్నవైనను పరలోకమందున్నవైనను" (1:20)

**ఆయన సిలువ రక్తము చేత సంధిచేయబడుట** గూర్చి పౌలు మాటలాడుచున్నాడు. పాపములు క్షమింపబడుట ద్వారా మానవ జాతి దేవునితో సమాధానపరచబడు నిమిత్తము యేసు తన రక్తమును చిందించాడు (మత్తయి 26:28). దేవునికిని మానవునికిని మధ్య సమాధానమను బంధము నిర్మింపబడక మునుపు పాపము అడ్డుగోడపడగొట్టబడవలసినదే. ఏ ఒక్కరైనను, ఇహలోకమందలి జీవిత కాలములో, రక్తము చిందింపబడకుండా దేవుడు పాపమును ఎందుకు క్షమించాడో, ఎప్పుడైనను ఎరుగరు (హెబ్రీయులకు 9:22). "ప్రాణమునకు ప్రాణము" అను నియమము (నిర్గమకాండము 21:23-24; ద్వితీయోపదేశకాండము 19:21) సమాధానపరచబడుటకు న్యాయసూత్రంగా పనిచేయవచ్చును. పాపము వలన వచ్చు జీతము మరణము (రోమీయులకు 6:23). పాపక్షమాపణను, సమాధానపరచబడుటను, నిత్యజీవమును, మరియు దేవునితో సమాధానమును సమకూర్చునట్లు యేసు ప్రాణాధారమైన తన రక్తమును ధారపోయుట ద్వారా ఆయన పాపశాపమును మరియు దండనను తానే భరించాడు (గలతీయులకు 3:13).

యేసు జన్మించినప్పుడు, దేవదూతలు సమాధానం గూర్చి గానం చేసారు: "సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమ, ఆయనకిష్టులైన మనుష్యులకు భూమి మీద సమాధానము కలుగునుగాక" (లూకా 2:14). ఆయనను వెంబడించువారికి కలుగు శ్రమలలో ఆయన తన సమాధానాన్నిచ్చునని యేసు వాగ్దానం చేసాడు (యోహాను 14:27; 16:33). వారు "మేలు చేయునట్లు" (రోమీయులకు 2:10), విశ్వాసము చేత ప్రేరేపణనొందువారికి దేవునితో సమాధానము కలుగుతుంది (రోమీయులకు 5:1; హెబ్రీయులకు 11:6). ఆధ్యాత్మిక మనస్సున్నవారు సమాధానము కనుగొనగలరు (రోమీయులకు 8:6), కానీ చెడు చేయువారు సమాధాన మార్గము ఎరుగరు (రోమీయులకు 3:17). దేవునితో సమాధానపరచబడుట వలన కలుగు సమాధానము మానవాళికి అవసరమైయున్న సువర్తమానముగా బయలుపరచబడినది (రోమీయులకు 10:15; ఎఫెసీయులకు 2:17).

ఈ వచనములో, **ఆయన ద్వారా, నేను చెప్పుచున్నాను,** అని కలుపుచు, **అవి భూలోకమందున్నవైనను పలోకమందున్నవైనను** అని పౌలు పునరుచ్చరించాడు. "ఉన్నవి" (విషయములు/వస్తువులు) అను పదము మానవ జీవులను మించి విస్తారమైన విషయములకు వర్తింపబడగలదు, కానీ సృజింపబడిన "వస్తువులను" విమోచించుట కొరకు యేసు రక్తము చిందింపబడాల్సిన అవసరమేమున్నది? ఆయన రక్తము పాపక్షమాపణ నిమిత్తము చిందింపబడినది (మత్తయి 26:28). పాపము చేసినది, మానవుడు మాత్రమే, సృజింపబడినది సమస్తము కాదు.

ఆదాము చేసిన పాపమునుబట్టి, సృజింపబడిన సమస్తము, నేల, సౌరకుటుంబము, మరియు తారలతో నిండియున్న గగనతలముతోసహా, సమస్తము శపింపబడినదనునది ఒక వివరణయై యున్నది. సిలువ ద్వారా యేసు ఆ శాపమును బాపెను, తత్ఫలితంగా ఆదాము చేసిన పాపము వలన కలిగిన విరసత్వమునకు పరిష్కారము సాధ్యమయ్యింది. అంతిమ

సత్ఫలితముగా సమస్తము పునరుద్ధరీకరింపబడును. శాపమునకు (ఆదికాండము 3:17) మునుపుండిన సార్వత్రిక సామరస్యము మరియు సమాధానము సహితము సర్వసృష్టికి నిమిత్తము పునరుద్ధరింపబడుతుంది (రోమీయులకు 8:18–23). పౌలు భావము ఈ క్రింది విధముగా నుండునని హెర్బర్ట్ ఎమ్. కార్సన్ ఇలా చెప్పుచున్నాడు:

> "సమాధానపరచబడుట" మానవులకు మాత్రమే పరిమితమై యుండలేదు. అది సృష్టిక్రమములోని సమస్త జీవులకు వర్తించుచున్నది. "సకల మానవులు" అని ఇచ్చట పౌలు చెప్పకపోవుట ప్రాముఖ్యమైన విషయమై యున్నది, ఏలయనగా అలా చెప్పినట్లయితే అది ఆయన సామాన్యంగా తెలియజెప్పుచుండు సమస్త విషయములు అను మాటలకు పరస్పరము వ్యతిరేకమైనదగును. ఈ పదజాలము అనిశ్చయముగా నున్నది గనుక అది దేవుని ప్రణాళిక యొక్క సంపూర్ణతను సూచించుచున్నది. పాపిష్ఠియైన మానవుడు మాత్రమే సమాధానపరచబడలేదు, కానీ పాపము వలన నాశనమునకు గురిచేయబడిన సృష్టిక్రమములోని సర్వసృష్టియు (రోమీయులకు 8:20–23 చూడుము) సిలువపై చేయబడిన పాపప్రాయశ్చిత్తార్థమైన శక్తివంతమైన చర్యలో పాలుపంపులు కలిగియుండును.[23]

కొందరు అభిప్రాయపడునట్లుగా, యేసు మరణము భూలోకమందున్నవాటిని పరలోకమందున్నవాటితో సమాధానపరిచినదని పౌలు రచించలేదు. ఆయన మరణము భూమిపై నున్నవాటికిని పరలోకములో ఉన్నవాటికిని సమాధానమును సమకూర్చినది. సమాధానపరచబడుట ఆవశ్యకమైయున్న వారందరు సమాధానపరచబడుటను యేసు సమకూర్చాడనునది దాని అర్థమై యుండవలెను. దేవునికి విరోధముగా అపరాధము చేసినవారు మాత్రమే ఆయనతో సమాధానపరచబడవలెను కాబట్టి, భౌతికమైన వస్తువులు, జంతువులు, మరియు జీవముగల ఇతరమైన ప్రాణులు మినహాయింపబడవచ్చును. దేవునికి విరోధముగా అపరాధముచేయునవి దురాత్మలు, దూతలు, మరియు ప్రజలు. మంచి దూతలు సమాధానపరచబడవలసిన అవసరత లేదు. చెడు దూతలు మరియు దురాత్మలు సమాధానపరచవలసి యున్నది కానీ వారు దానిని పొందుకొనరు. సమాధానపరచబడుటకు యిక మిగిలినది పాపిష్ఠియైన మానవజాతి మాత్రమే.

భూలోకమందున్న మానవునికి యేసు ద్వారా సమాధానము అందుబాటులో నుండు ఏర్పాటుచేయబడినదని అర్థంచేసికొనుటలో బహుశా ఏ కష్టమును తలెత్తకపోవచ్చును – కానీ యేసు ద్వారా లభించు సమాధానము పరలోకములో నున్న ఎవరికి అవసరమౌతుంది? ఏలయనగా మలినమైనదేదియును పరలోకములోనికి, దేవుని నివాసములోనికి ప్రవేశింపనేరదు (ప్రకటన 21:27). ఇంకా, యేసు చేపట్టిన విమోచనా కార్యము ద్వారా సాధ్యము చేయబడిన సమాధానము పాపము చేసిన దేవదూతలకు సంబంధించిన జీవులకు సహితము విస్తరించియున్నందున అభిప్రాయము పాపిష్ఠియైన దూతలకు సంబంధించి పేతురు చెప్పిన విషయమును వ్యతిరేకించును. ఇటువంటి దూతలు, తీర్పు కొరకు ప్రత్యేకంగా కేటాయింపబడిన అంధకారములో బంధింపబడి యున్నారు (2 పేతురు 2:4). వారు పరలోకములో లేరు, ఏలయనగా వారి అంత్య తీర్పు నిమిత్తము వేచియుండుటకు వారు "నరకము (*tartarōsas*) లోనికి త్రోసివేయబడి యున్నారు" – అక్షరాలా, "tartaras - లోనికి త్రోసివేయబడి యున్నారు." ఈ సందర్భములో "తీర్పు"ను మత్తయి 23:14లో పేర్కొనబడినట్లుగా (మార్కు 12:40; లూకా 20:47; 23:40; రోమీయులకు

3:8; 13:2; 1 తిమోతి 3:6; 5:12; యూదా 4వ వచనం చూడుము) "శిక్షావిధి" యని అనువదించవచ్చును.

సమాధానపరచబడుటలో "సృష్టింపబడిన శ్రేణి" చేరి యున్నదని తర్కించినప్పుడు, "భూమి" లేక "పరలోకము" అని చెప్పలేదు కానీ "భూమిపై" పరలోకము "లో" అని పౌలు చెప్పాడను వాస్తవమును కార్సన్ చూచి చూడనట్లున్నాడు. సమాధానము అనునది భూమి మీద మరియు పరలోకములో ఉన్నవాటికే, కానీ భూమికొరకు లేక పరలోకము కొరకే వర్తించదు. భూమీయు మరియు ఆకాశములు గతించిపోవును (మత్తయి 24:35) మరియు అవి కాలిపోవును (2 పేతురు 3:10-12). యేసు క్రీస్తు సమాధానపరచునది, ఆదాము మరియు హవ్వ చేసిన పాపమును బట్టి నేలకు ఇవ్వబడిన శాపము కాదు (ఆదికాండము 3:17).

పౌలు ఫిలిప్పీయులకు 2:10లో చెప్పినట్లు, "భూమి క్రింద" అను మాటలు ఇక్కడ చేర్చలేదని కార్సన్ గుర్తించాడు. "భూమి క్రింద" అనగా దుష్టశక్తులు అని అర్థము. పౌలు వీటిని చేర్చి ఉండినటయ్లితే, సమాధానపరచబడుటను యేసు సాతాను, దురాత్మలైయున్న వాని వార్తాహరులు, మరియు సకల దుష్టుల కొరకు సమకూర్చాడని ఆయన బోధించెడివాడే.

యేసు భూమి మీద ఉన్నవారి కొరకును, ఆయన సిలువవేయబడక మునుపు మృతిచెందిన వారి కొరకును, సమాధానపరచబడుటను సాధ్యం చేసాడని పౌలు భావించాడనునది సమంజసమైనదిగా కనిపించుచున్న కంగారై యున్నది. వారి వారి జీవిత కాలములో, దేవుని చిత్తప్రకారము జీవించుటకు వారు ప్రయత్నించారు, కానీ వారు అదివరకే మృతిచెంది, సమాధానపరచబడుట సాధ్యము చేయబడక మునుపు, భూమికి వెలుపలనున్న పరలోక ప్రదేశములలో, ప్రేతల లోకములో ఉన్నారు. ఆయన బలియాగము ద్వారా, వారు దేవునితో సమాధానపరచబడ్డారు (రోమీయులకు 3:25; హెబ్రీయులకు 9:15 చూడుము). పేతురు చెప్పినట్లు (అపొస్తలుల కార్యములు 2:34), వీరు యింకను పరలోకములో దేవునితో కూడ లేరు. ఏదిఏమైనా, వారు భూలోక ప్రదేశమునకు వెలుపల ఉన్నందునుబట్టి, వారు పరలోకములో ఉన్నారని ప్రస్తావించుకొనవచ్చును (ఎఫెసీయులకు 6:12).

రెండు భిన్నమైన గ్రీకు విభక్తి ప్రత్యయములను ప్రయోగించుట ద్వారా ప్రదేశముల నడుమ ఒక ప్రత్యేకతను చూపించవలెనని పౌలు ఆలోచించి యుండవచ్చును: భూమి మీద ఉన్నవారిని సూచించుటకు *epi* ("మీద"/"పై") అనియు, పరలోకములో ఉన్నవారిని సూచించుటకు *en* ("లో"/"లోపల") అనియు ప్రయోగించాడు. భూమియే సమాధానపరచబడినదని పౌలు ప్రస్తావించుట లేదు, కానీ "భూమి మీద" సజీవులై యున్న ప్రజలను సూచించుచుండెను. పరలోకమే అని ఆయన భావించలేదు, కానీ పరలోకములో – అనగా, ప్రేతల లోకములో, భౌగోళిక ప్రదేశమునకు వెలుపల నున్నది కానీ దేవుడున్న పరలోక స్థితిలో ఉన్నవాటినికాదు.

15 నుండి 20 వరకు గల వచనములు యేసునకు సంబంధించిన ఒక "స్తోత్ర గీతమైయున్నదని" కొందరు పండితులు ఎంచుదురు, కానీ దాని ఏర్పాటుకు సంబంధించినంత వరకు వారిలో విశాలమైన భేదాభిప్రాయములున్నవి. అదొక స్తోత్రగీతముగా ప్రయోజనకరమై యుండినదా లేదా అనునది ఏ విషయమే అయినా, పౌలు చేసిన తరువాతి వ్యాఖ్యానమునకు ఈ విభాగము పునాది వేసినది.

యేసు యొక్క సర్వోచ్చమైన లక్షణముల ప్రాముఖ్యతను హే ఇలా వివరించాడు:

> కుమారుడు దేవుని స్వరూపమై యున్నాడని చెప్పిన వర్ణన (వచనం 15) క్రైస్తవులు వారి సృష్టికర్త యొక్క స్వరూపమును ధరించియున్నారని వారి గూర్చిన ప్రకటనకు సమాయత్తమును సమకూర్చుచున్నది (3:9–10). యేసు సంఘమునకు శిరస్సై యున్నాడను స్వాధికార స్వరము (1:18), 2:10, 19; యింకా ఎక్కువగా వివరించబడినది. కుమారుడు అన్నిటి కంటె ప్రాముఖ్యమైనవాడై యున్నాడను వాంగ్మూలము (1:18), 1:28; 2:3, 6–7, 17, 19; 3:3, 11; 4:1లో ఇటువంటి ఘోషణలు మరియు హెచ్చరికలకు మార్గమును సరాళము చేయుచున్నది. క్రీస్తు మరణము రక్షణకు మూలాధారమై యున్నదను సత్యము గూర్చిన ధ్రువీకరణము, 1:20 వచనములను 1:14, 22; 2:11–15; మరియు 3:13తో జోడించుచున్నది. సంఘము, క్రీస్తుశరీరమై యున్నదను ఆలోచన 1:24 మరియు 2:19లో పున:ప్రత్యక్షమగుచున్నది. క్రీస్తుతో కూడ మృతిచెందుట మరియు లేచుట గూర్చిన నిశ్చయతలు (2:12–13, 20; 3:1, 5) "మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను" (1:18) గూర్చిన భావమును సుస్పష్టముచేయుచున్నవి. 1:16లో సూచింపబడిన దేవతల అధికారములు, 2:8, 15, 18 మరియు 20వ వచనములో గల లోకాతీతమైన ప్రాణుల గూర్చిన ప్రస్తావనలలో ప్రతిధ్వనించుచున్నవి. కుమారుని యొక్క సార్వత్రికమైన ప్రాముఖ్యత, 1:15–20 వచనములలో నొక్కివక్కాణింపబడి, సర్వలోకములో సర్వసృష్టికి సువార్త ఎందుకు ప్రకటింపబడుచున్నదో వివరించుచున్నది (1:6, 23, 27–28; 3:11; 4:3–6). చివరిగా, లోకము కుమారుని ద్వారా దేవుని సృష్టియై యున్నదనుట గూర్చిన స్తోత్రగీతములో గల నిర్మాణాత్మకమైన దృష్టికోణము, 2:16–23లో వైరాగ్యము గూర్చి అబద్ధ బోధకులు చేయుచున్న తర్కవితర్కములకు వ్యతిరేకముగాను, 3:5–4:6లో లోకములోని జీవితము గూర్చిన నిర్మాణాత్మకమైన ఉపదేశము విషయములోను అభయహస్తమును అందించుచున్నది.[24]

## అన్వయము

### క్రీస్తు యొక్క గొప్పతనము (1:15–19)

క్రీస్తు యొక్క అధికారము మరియు స్వభావములను తెలియజెప్పుచూ ఆయన యొక్క గొప్పతనమును పౌలు వర్ణించాడు. వారు క్రీస్తు యెడల రాచభక్తిగలవారై యుండుటకు కొలొస్సయులను ప్రోత్సాహించునట్లు ఆయన ఈ సమాచారమును నివేదించాడు. క్రీస్తు యొక్క గొప్పతనము గూర్చిన చర్చను నాలుగు వర్గములుగా విభాగింపవచ్చును: ఆయన ఎవరిని పోలి యుండును, ఆయన ఏం చేసాడు మరియు ఏంచేయుచున్నాడు, ఆయన స్థానమేమిటి, మరియు ఆయన అధికారము యొక్క అత్యున్నతమైన స్థానమేమై యున్నది.

(1) *క్రీస్తు ఎవరివలె ఉన్నాడు.* ఆయన దేవుని స్వరూపమై యున్నాడు (2 కొరింథీయులకు 4:4 చూడుము). తండ్రి మహిమను ప్రదర్శించుచు, దేవుడు ఎలా ఉంటాడో బయలుపర్చుటకు యేసు ఈ లోకమునకు వచ్చాడు (యోహాను 1:14, 18). ఆయన చూచినవారు తండ్రిని సహితము చూచియున్నారని ఆయన తన అపొస్తలులకు తెలియజెప్పాడు (యోహాను 12:45; 14:9). యేసు ఇలా ఎందుకు తెలియజెప్పాడనగా, తండ్రి యేసునందున్నాడు మరియు యేసు తండ్రియందున్నాడు (యోహాను 10:38; 14:10, 11; 17:21).

ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు (యోహాను 1:18), ఏలయనగా ఆయన "సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వముగలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, చూడనేరడు" (1 తిమోతి 6:16). దేవుడు మానవ కంటికి అదృశ్యుడు గనుక, ఆయన తనను తాను యేసుక్రీస్తు ద్వారా బయలుపర్చుకొన్నాడు, యేసు సమస్త విషయములలోను తండ్రి వలె ఉన్నాడు (హెబ్రీయులకు 1:3).

ఆయన సృష్టించిన సృష్టి ద్వారా దేవుడు తనను తాను బయలుపర్చుకొన్నాడు, అది ఆయన యొక్క శక్తి మరియు మహిమ యొక్క మహత్యమును కనుపర్చుచున్నది (కీర్తనలు 19:1; రోమీయులకు 1:20). ఏదిఏమైనా, దేవుని సమస్త గుణగణములను ఇదొక్కటే తెలియజేయదు. యేసు స్వభావము గూర్చిన పరిజ్ఞానమును సంపాదించుకొనుట ద్వారా మనము దేవుని స్వభావము గూర్చి నేర్చుకొనవచ్చును.

దేవుని తెలుసుకొనుట మనము సంపాదించుకొనగల అత్యంత ముఖ్యమైన తెలివియై యున్నది. మన నిత్య జీవము మనము ఆయనను ఎరుగుటపై ఆధారపడియున్నది (యోహాను 17:3). మనము ఆయనను ఎరుగుచుండు కొలది ఆయనకు లోబడుచు, పాపముచేయు విషయంలో నిగ్రహించుకొనుచుండవలెనని ప్రేరేపింపబడుచున్నాము (1 యోహాను 2:3-6; 3:6). మానవుని ఉనికి యొక్క ఉన్నతస్థాయి దేవుని ఎరుగుట ద్వారా కలుగును (యిర్మీయా 9:23, 24). యేసు, దేవుని స్వభావమునే కలిగియున్నాడు కాబట్టి, మనము తండ్రికి ఆరోపించు ఆరాధనపూర్వక గౌరవమును యేసు యెడల సహితము చూపించవలెను (యోహాను 5:23).

(2) *యేసు ఏంచేసాడు మరియు ఏంచేయుచున్నాడు.* యేసు సర్వమును సృష్టించిన సృష్టికర్తయని ఆయన యెడల భక్తిపూర్వకభయముతో మెలగవలెను. ఆదియందు ఆయన దేవునితో కూడ ఉండెను గనుక ఆయన తండ్రి కలిగియున్న దైవికమైన స్వభావమును కలిగియున్నాడు. యేసు సర్వమును సృష్టించాడని వెల్లడిచేయుచు యోహాను తన సువార్త రచనను మొదలుపెట్టాడు.

సర్వసృష్టికి ఆయనే ఆదిసంభూతుడైయున్నాడని చెప్పుట ద్వారా (వచనం 18), యేసు సృష్టింపబడినాడని పౌలు బోధించలేదు; ముఖ్యంగా, ఆరంభమును సక్రియాకరణము చేసినది ఆయనే అని పౌలు బోధించుచుండెను. సృష్టికి మూలము మరియు ఆదియు యేసే. ఆదియందు సృజింపబడిన మొదటివాడు యేసు కాదు, ఏలయనగా ఆయన సర్వమునకు ముందే, ఆదియందే ఉన్నవాడై యున్నాడు, మరియు సర్వమును సృజించినది ఆయనే, గనుక ఆది ఆరంభమైనప్పటికి ముందే ఆయన తండ్రితో కూడా ఉన్నాడు.

ఆయన సర్వమును తన వాక్యము యొక్క మహత్తు చేత నిర్వహించుచున్నాడు (హెబ్రీయులకు 1:3). ఏ వాక్కుచేతనైతే ఆయన సర్వమును సృజించాడో (హెబ్రీయులకు 11:3), సమస్తమును సక్రమంగా నిర్వహించుటకు ఆయన అదే వాక్కును ప్రయోగించుచున్నాడు. ప్రస్తుతకాలమందలి ప్రపంచము నాశనమగు దినము వరకు ఆయన వాక్యము దానిని కాపాడి సంరక్షించును (2 పేతురు 3:5-7).

ఆయన తన వాక్యము చేత సమస్తమును సృజించుట ద్వారా ఆయన వాక్యమునకు గల శక్తిని యేసు ప్రదర్శించాడు (హెబ్రీయులకు 4:12). దీని ఆధారంగా, మనము ఆయన

వాక్యమునందు నమ్మకముంచవచ్చును. ఆయన ఏమి చేయగలడని సెలవిచ్చాడో, దానిని ఆయన చేయగలడు. ఆయన వాక్యము ద్వారా మనము రక్షింపబడి (యాకోబు 1:21) అట్టి రక్షణ ద్వారా సమకూడు సకలాశీర్వాదములను పొందుకొనగలము.

(3) *యేసు యొక్క స్థానము.* సృజింపబడిన సర్వము ఆయన కొరకు సృజింపబడెను. క్రీస్తు హెచ్చింపబడవలెనని తండ్రి ఆశించాడు, ఇది సృష్ట్యారంభమునకు మునుపే ప్రణాళిక వేయబడినది (అపొస్తలుల కార్యములు 2:23; ఎఫెసీయులకు 1:4; 1 పేతురు 1:19, 20). ఈ సంఘటన ద్వారా యేసు మహిమపరచబడవలసినవాడై యుండెను. ఆయన అన్నిటిని మించి గౌరవింపబడుట, మానవాళి రక్షణార్థమై ఆయన మరణించుట ద్వారా సంభవింపవలెనని ముందుగానే నిర్ణయింపబడినది (ఫిలిప్పీయులకు 2:8-11).

మనము మన నిమిత్తము కాదు కానీ యేసు నిమిత్తము ఉన్నాము. మనము ఆయనను స్తుతించుచు, గౌరవించుచు, మరియు ఆయననే సేవించుచుండుట మన జీవితముల ఉద్దేశమై యున్నది. మనము సృజింపబడినది ఆయన మహిమ కొరకే. యేసు జీవించిన విధంగా జీవించుచు (1 యోహాను 2:6), మనము ప్రదర్శించు మాదిరి ద్వారా, ఆయన స్వభావ సౌందర్యమును మనము ఇతరులకు కనుపర్చుచుందుము.

ఆయన సమస్తమునకు మునుపే యున్నాడు. శాశ్వత నిత్యత్వము నుండి కూడ, ఆయన తండ్రియొద్ద ఉండెను (మీకా 5:2). ఆది గాని, అంతము గాని లేకుండా ఒక జీవి ఉండగలడను భావన మన అవగాహనకు ఆవల ఉన్నది, అది మన ఊహకందదు. మన కంటికి కనబడుచున్నవన్నియు ఎల్లప్పుడు ఉనికి కలిగియుండలేదు, సరికదా అది ఎల్లప్పుడును నిలిచియుండనేరదు.

యేసు మన కన్నులకు గోచరముకాని పరలోకం ఉన్నాడు (2 కొరింథీయులకు 5:1). మనకు అవసరమైయున్న నిత్యజీవము కొరకు మనము ఆయన మీద ఆధారపడవచ్చును ఏలయనగా ఆయన నిత్యుడై యున్నాడు. యేసుక్రీస్తునందున్నవారికి నిత్యజీవము అందుబాటులో ఉన్నది (యోహాను 3:36; 1 యోహాను 5:11, 12). మనము బాప్తిస్మము పొందినప్పుడు ఆయన లోనికి ప్రవేశించుదుము (రోమీయులకు 6:3; గలతీయులకు 3:27).

సర్వసంపూర్ణత ఆయన యందు నివసించుచున్నది. రాబోవు కాలము కొరకైన జీవమును, ప్రస్తుతకాలమందు సమృద్ధియైన జీవము నిచ్చువాడు యేసే (యోహాను 10:10). విశాల విశ్వమందంతటను, సర్వ జనులు ఆయన మీదనే ఆధారపడియున్నారు. ఈ హేతువునుబట్టియే, మనము ఆయన యందు నిలిచియుంటూ ఆయననే సేవించుచు, మన జీవితాల్లో ఆయన రాజ్యమునకు ప్రథమ స్థానమునిచ్చుచుండవలెను (మత్తయి 6:33).

(4) *యేసు అధికారము యొక్క అత్యున్నతమైన స్థానము.* ఆయన అన్నిటియందును ప్రథమ స్థానమును కలిగియుండునట్లు, ఆయన సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు మరియు మృతులలో నుండి లేచినవారిలో ఆయన ప్రథమ ఫలమై యున్నాడు. యూదులు కుటుంబములో జ్యేష్ఠపుత్రునికి అత్యున్నతమైన గౌరవ స్థానము ఈయ్యబడినది. సర్వ సృష్టితో గల సంబంధము విషయంలో క్రీస్తు ఇదే హోదాను కలిగియున్నాడు. తండ్రి మాత్రమే ఆయన అధికారము క్రింద లేడు (1 కొరింథీయులకు 15:27). మిగిలిన విశ్వమంతయు ఆయన అధికారము క్రింద నున్నది.

ఆయన ఒక పర్యాయము మృతిచెందినప్పటికిని, ఆయన ఇప్పుడు సజీవుడై

యున్నాడు; ఏలయనగా ఆయన మరణమును ఓడించాడు, మృత్యువును జయించాడు. మరణించినవారందరి కంటే ఆయన ఉన్నతమైన స్థానము కలిగియున్నాడు, ఇది ఆయనకు మొట్టమొదటి స్థానమునిచ్చుచున్నది. యేసు తన పునరుత్థానము మరియు ఆరోహణ ద్వారా సమస్తమునకు పై స్థానములో ఉంచబడియున్నాడనియు, సమస్తము ఆయన అధికారము క్రింద ఉంచబడినదనియు చెప్పుచు, పౌలు సత్యమును బోధించాడు.

మరణము ఆయనను బంధించి యుంచలేకపోయింది (అపొస్తలుల కార్యములు 2:24). ఆయన తన ప్రాణమును పెట్టుటకును, దానిని తిరిగి తీసుకొనుటకును ఆయనకు అధికారముండినది (యోహాను 10:18). ఆయన మరణమును జయించి మరలా లేచినందునుబట్టి, మరణించినవారిని లేపుటకు ఆయనకు అధికారము కలదని ఆయన మనకు అభయమిచ్చుచున్నాడు.

ఏ మానవ అధికారమైనను యేసు అధికారముతో పోటీ చేయజాలదు, సాటి కాజాలదు. మనము ఆయనను మన ప్రభువుగాను యజమానిగాను గౌరవించుచు ఆయనకు లోబడవలసినవారమై యున్నాము, ఏలయనగా ఏ దేవదూతయైనను లేదా ఏ మానవుడైనను యేసునకు ప్రత్యర్థిగా నిలువనేరడు. ప్రేరేపింపబడిన ఆయన యొక్క ప్రతినిధుల ద్వారా క్రీస్తు బయలుపరిచినవాటికి విరుద్ధమైన విషయములను ఎవరైనను బోధించినట్లయితే, వానిపై పరలోక శాపము నిలిచియుండును (గలతీయులకు 1:8, 9).

శరీరమునకు అనగా సంఘమునకు, శిరస్సై యున్నాడు. ఆయన ఎవరైయున్న దానినిబట్టి, సంఘము ఆయనను శిరస్సుగా గౌరవించవలెను. మానవ శిరస్సు మానవ శరీరముతో కలిగియున్న సంబంధము, యేసునకును నడుమ నుండు సంబంధమును చిత్రీకరించుచున్నది. క్రీస్తు శరీరములో, అనగా సంఘములో సభ్యులమై యున్న మనము, ఆయన మన ఆధ్యాత్మిక యజమాని యని ఆయనకు లోబడవలెను (ఎఫెసీ 5:24). అదొక వ్యక్తి గాని, గుంపు గాని, మరెవరికైనను మనము యేసునకిచ్చు గౌరవమర్యాదలను కనుపర్చుటకు మనకు ఏ హక్కైనను లేదు. మనకు అధిపతియైనవానిగా యేసును మాత్రమే అంగీకరింపవలెను.

సంక్షిప్తముగా చెప్పుకొంటే, క్రీస్తు దేవుని స్వరూపమై యున్నాడు, ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సృజింపబడినది, గనుక ఆయన ఒక ఉన్నతమైన అధికార స్థానమును నిర్వహించుచున్నాడు. దీనినిబట్టి మనము ఆయనను గౌరవించవలెను, ఆయనను తెలిసికొనవలెను, మరియు ఆయన అధికారమునందు నమ్మకముంచవలెను.

**క్రీస్తు లక్షణములు (1:15, 17–19)**

క్రైస్తవుల జీవితములు యేసునకు విశ్వములో గల హోదా చుట్టూర నిర్మింపబడినవై యుండవలెను. ఇది మన ఆలోచనా ధోరణిని మాత్రమే కాదు, కానీ మన చర్యలను సహితము ప్రభావితము చేయవలెను. యేసు ఎవరై యున్నారో అను దానినిబట్టి, మనము ఆయన యెడల సంపూర్తి స్వామిభక్తిని కనుపర్చవలసియున్నది. ప్రభువు యెడల గల అంకిత భావమును ఇంతటి పరిణామములో మనము కలిగియున్నప్పుడు, అబద్ధ బోధలకు, నశింపజేయు అలవాట్లకు (దుర్నీతికి), మరియు ఏకాగ్రతను భంగముచేయు అభ్యాసములకు – వాటంతట అవే చెడ్డవి కావు కానీ మనము క్రీస్తునకు ఋణపడియుండు సేవ నుండి

మనలను పెడదారిపట్టించు క్రియలకు – మనము ఆమడ దూరములో ఉందుము.

*యేసు, దేవుని స్వరూపియై యున్నాడు* (వచనం 15). యేసు తండ్రి స్వభావమును బయలుపర్చుటకు వచ్చాడు (యోహాను 1:18). "నన్ను చూచువాడు నన్ను పంపినవానిని చూచుచున్నాడు" (యోహాను 12:45); "నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు" (యోహాను 14:9) అని ఆయన ప్రబోధించాడు. క్రీస్తు "దేవుని స్వరూపమై యున్నాడని" రచించిన తరువాత, "... దేవుడే తన మహిమను గూర్చిన జ్ఞానము యేసుక్రీస్తునందు వెల్లడిపరుచుటకు మా హృదయములలో ప్రకాశించెనని" (2 కొరింథీయులకు 4:4, 6) చేర్చుటలో తన తలంపును పౌలు కొనసాగించాడు.

యేసు పవిత్రుడును, పరిశుద్ధుడును, దయగలవాడును, మరియు జాలిగలవాడునై యుండెను. ఆయన లక్షణములు క్రైస్తవులు పెంపొందించుకొనవలసిన చిహ్నములై యున్నవి. మనము దేవుని పరిశుద్ధ లక్షణములను అనుసరించవలసి యున్నది. మనము ఆయనను వెంబడింపవలెనని ఆయన తననుతానే మన కొరకు నమూనాగా అర్పించుకొన్నాడు (1 పేతురు 1:16). యేసు నడుచుకొన్నట్లు మనము నడుచుకొనినయెడల (1 యోహాను 2:6), మనము కూడ దేవుని వలె మారుదుము.

*యేసు సృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు* (వచనం 15). "ప్రథమఫలముగా," యేసుకు దేవుని కుటుంబములో అత్యంత గొప్ప గౌరవపూర్వకమైన, స్థానమున్నది, ఆయన "అనేక సహోదరులలో ప్రథమఫలమై" యున్నాడు (రోమీయులకు 8:29). "క్రైస్తవులు క్రీస్తుతోడి వారసులై యున్నారు" (రోమీయులకు 8:17). ప్రజలు ఆయన మాదిరిని అనుసరించగలుగునట్లు యేసు రక్తమాంసములుగల మానవుడయ్యాడు (హెబ్రీయులకు 2:14, 17). మనము ఆయనతో జీవించునట్టు మనము ఆయన నిమిత్తము జీవించవలసియున్నది. ఆయన తన తోబుట్టువుల గూర్చి ఆందోళన చెందుచు చింతించుచున్నందున, ఆయన మన పెద్ద అన్నయై, మన సమస్త అవసరములను సమకూర్చువాడై యున్నాడు. ఆయన యొక్క మంచితనము, జాలి, మరియు ప్రేమనుబట్టి ఆయనను ప్రశంసించుచు మనము ఆయన వైపు చూచుచుందుము.

సర్వసాధారణంగా, కుటుంబంలోని తొలిసంతానమునకు తరువాత పుట్టిన చిన్న పిల్లలు వాని గూర్చి గొప్పగా ఆలోచించుదురు. సామాన్యంగా అతడు అత్యధిక పరిపూర్ణత మరియు అనుభవములతో, మరింత లోతైన పరిజ్ఞానములు మరియు శ్రేష్ఠమైన సామర్థ్యములు గలవాడై యుండును. వాడు తన సహజ గౌరవపూర్వకమైన స్థానము గూర్చి గంభీరముగా ఆలోచించినట్లయితే, తన కంటె చిన్నవారైన తన సహోదర సహోదరీలు అనుకరించుటకు వాడొక అనువైన మాదిరి యగును. ఆయనను వెంబడించువారందరి నుండి ఇటువంటి గౌరవపూర్వకమైన ఘనతను పొందవలసినవాడై యున్నాడు.

*యేసు అన్నింటికంటె ముందుగా ఉన్నాడు* (వచనం 17). యేసు నిత్య స్వభావము కలిగియున్నాడు, ఏలయనగా ఆయన "పురాతన కాలము మొదలుకొని శాశ్వతకాలమున్నాడు" మరియు "లోకము పుట్టకమునుపే" ఉన్నవాడై "ఆదియందు దేవునియొద్ద ఉండెను" (మీకా 5:2; యోహాను 1:2; 17:5). ఆయన గత నిత్యత్వమంతటిలో తండ్రితో కూడ ఉన్నాడని, ఆయన తండ్రి ఎరుకను పంచుకొనుచున్నాడని అర్థము. తండ్రి కలిగియున్న సకల విషయములు యేసునకు చెందినవై యున్నవి, అలాగే యేసు కలిగియున్నవన్నియు తండ్రికి చెందినవై యున్నవి (యోహాను 17:10). ఈ హేతువునుబట్టి, నిత్యజీవము గూర్చి

మానవాళితో దైవము పంచుకొను తెలివికి సంబంధించిన ప్రతి కోణమునకు మూలము యేసే అను హామీ క్రైస్తవులకు కలుగుచున్నది (యోహాను 12:49, 50; 17:8).

*యేసు ప్రాముఖ్యతను కలిగియున్నాడు* (వచనం 18). సృష్టికర్తయై, సర్వసృష్టికి ఆదిసంభూతుడై, అన్నిటి కంటె ముందుగా ఉన్నవాడై, సమస్తమును నిర్వహించుచు, క్రీస్తు అన్నిటిలోను ప్రాముఖ్యతను కలిగియున్నాడు. యేసు ఎవరైయున్నాడో అను అంశము ఆధారంగాను, విశ్వమంతటిలో ఆయనకు గల ప్రథమ స్థానమునుబట్టియు, క్రైస్తవుల జీవితాల్లో యేసుకు తప్ప మరెవరికైనను ప్రాముఖ్యత ఇయ్యబడకూడదు. క్రీస్తు అధికారమునకు పైన తండ్రి మాత్రమే ఉన్నాడు (1 కొరింథీయులకు 15:27). యేసు కంటె ఎక్కువ ప్రాధాన్యత ఇయ్యబడునదేదైనను న్యాయసమ్మతమైన ఆయన స్థానమును ఆయన నుండి అపహరించును. ఆయన మానవజాతికి (యోహాను 17:2), ఇహపరలోకములందలి (ఎఫెసీయులకు 1:20, 21), మరియు దేవదూతల సైన్యసమూహమునకు సహితము (1 పేతురు 3:22) పైన ఉన్నాడు.

"ప్రథమ స్థలమునకు" సంబంధించిన ఆయన స్థానము సంఘమునకు సహితము సంబంధించినదై యున్నది, ఏలయనగా ఆయన సంఘమునకు శిరస్సై యున్నాడు (ఎఫెస్సీయులకు 1:22, 23; 5:23). క్రైస్తవ జీవితములోని ప్రతి కోణములోను, శరీర (సంఘ) సభ్యులు శిరస్సైయున్న యేసు వైపు చూచుచుండవలెను. దాని శ్రద్ధ మరియు మార్గనిర్దేశనము నిమిత్తము శరీరము శిరస్సువైపు చూచుచుండవలెను, గనుక శరీర సంక్షేమము గూర్చి శిరస్సు చింతించుచుండును.

*యేసు తనయందు సర్వసంపూర్ణతను కలిగియున్నాడు* (వచనం 19). విశ్వములోని – ఇహలోక మరియు పరలోక ప్రాణులతో సహా – సమస్త విషయముల అవసరతలు యేసునందు తీర్చబడుచున్నవి. మానవ హృదయము యొక్క ప్రతి అవసరము మరియు ఆకాంక్ష ఆయనలో నెరవేరగలదు. సర్వసంపూర్ణత ఆయనయందే నివసించుచున్నది; విశాల విశ్వములో, అది ఆధ్యాత్మిక స్థితి కావచ్చు లేదా భౌతికమైన స్థితి కావచ్చు, దానికి అవసరమైనదేదైనను దానిని ఆయన సమకూర్చును.

### క్రీస్తు కార్యములు (1:16–18)

*యేసు ఆదియందు సర్వమును సృజించాడు* (వచనాలు 16, 18). జీవము మరియు పదార్థమునకు మూలము ఆయనే. ప్రస్తుత విశ్వమంతటిలోని ఏదైనను ఆయన లేకుండా ఉనికిలోనికి రాలేదు (యోహాను 1:3). సృష్టికర్తగా, మానవుడు చేసుకొనగల ఎటువంటి భౌతికమైన ప్రాతినిధ్యమైనను ఆయన వహించుటలేదు. బుద్ధిబలములేని పదార్థము చేత దేవుడు చేయబడజాలడు ఏలయనగా బుద్ధిబలములుగల జీవులు ఆయననుబట్టియే వాటి ఉనికిని కలిగియున్నవని పౌలు వక్కాణించాడు (అపొస్తలుల కార్యములు 17:29). సృష్టింపబడినది ఎన్నడును సృష్టించివానికంటే గొప్పదై యుండజాలదు. ఈ హేతువునుబట్టియే, సృష్టింపబడిన జీవి – మానవాళి – దేవుడు సృష్టించిన దానిని (రోమీయులకు 1:25) ఆరాధించకుండా లేక, వాడే చేసికొన్నదానిని దైవసమానముగా పూజించకుండా, సృష్టికర్తనే ఆరాధించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

*ఆయన సర్వమును నిర్వహించుచున్నాడు* (వచనం 17). దానిని గట్టిగా కలిపి పట్టుకొని

నిలిపియుంచునది – అవి మేకులు కావచ్చు లేదా దానిని స్థిరముగా నిలిపియుంచు ఇతరమైన సాధనమేదైనా కావచ్చు – ఉంటే తప్ప, ఒక ఇల్లు ఏ భాగమునకాభాగము కూలిపోవును. లోకము మరియు దానిని చుట్టుముట్టియున్న విశ్వము విషయంలో కూడ ఇది వాస్తవముగా వర్తించును. దానంతటిని యేసు తన వాక్యము యొక్క శక్తి చేత నిర్వహించుచున్నాడు (హెబ్రీయులకు 1:3). యేసు లేకుండా ఉన్నవారు వారి దేహము చిన్నాభిన్నమై పడిపోకుండా కాపాడుకొనుటకు కష్టపడుచున్నారు. ఆయన యొద్దకు వచ్చువారు అంతరంగ ఆలంబనమును మరియు ఆధ్యాత్మిక ఆహ్లాదపూర్వక విశ్రాంతిని పొందుచున్నారు (మత్తయి 11:28–30).

*ఆయన సంఘమునకు శిరస్సై యున్నాడు* (వచనం 18). దాదాపుగా జీవమునకు సంబంధించిన పర రూపములన్నియు సక్రమంగా పనిచేయుచుండునట్లు వాటికి ఒక శిరస్సు అవసరమై యున్నది. శరీరమునకు అవసరమైయున్న నిర్దేశనము, ఆధీనము, మరియు శ్రద్ధ శిరస్సు సరఫరా చేయుచుండును. ఇదే రీతిలో యేసు సంఘమునకు సమకూర్చుచున్నాడు. మార్గనిర్దేశనము నిమిత్తము సంఘము (శరీరము) ఆయన వైపు చూచుచుండవలెను. సంఘము యొక్క ప్రతి ఆధ్యాత్మిక అవసరమును ఆయన లేఖనములలో గల ఆదేశముల ద్వారా తీర్చుచు, పరిశుద్ధాత్మ ద్వారా చేయుచుండును (ఎఫెసీయులకు 3:16).

ఆయన రాజ్యమునకు ప్రథమ స్థానమునిచ్చువారి అవసరములన్నియును అలక్ష్యము చేయబడవని యేసు యొక్క మహత్వపూర్ణమైన గుణగణములు మనకు అభయమునిచ్చుచున్నవి (మత్తయి 6:33).

సూచనలు

[1]Eduard Schweizer, *The Letter to the Colossians: A Commentary*, trans. Andrew Chester (Zürich: Benziger Verlag, 1976; reprint, Minneapolis: Augsburg Publishing House, 1982), 67-68. [2]William Hendriksen, *Exposition of Colossians and Philemon,* New Testament Commentary (Grand Rapids, Mich.: Baker Book House, 1964), 72. [3]A. T. Robertson, *Paul and the Intellectuals: The Epistle to the Colossians*, rev. and ed. W. C. Strickland (Nashville: Broadman Press, 1959), 44. [4]H. C. G. Moule, *The Epistles to the Colossians and to Philemon,* The Cambridge Bible for Schools and Colleges (Cambridge: University Press, 1893; reprint, 1902), 77. [5]Ibid. [6]Watch Tower Bible and Tract Society of Pennsylvania, *You Can Live Forever in Paradise on Earth* (Brooklyn, N.Y.: Watchtower Bible and Tract Society of New York, 1982), 58. [7]*The New World Translation of the Holy Scriptures* (Brooklyn, N.Y.: Watchtower Bible and Track Society of New York, 1961), 1274. [8]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature*, 3d ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 194. [9]C. B. Hoch, Jr., “Only Begotten,” in *The International Standard Bible Encyclopedia*, rev., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1987), 3:606. [10]E. K. Simpson and F. F. Bruce, *Commentary on the Epistles to the Ephesians and the Colossians*, The New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1957), 197.

[11]Robert G. Bratcher and Eugene A. Nida, *A Translators Handbook on Paul's Letters to the Colossians and to Philemon*, Helps for Translators (New York: United Bible Societies, 1977), 24. [12]David M. Hay, *Colossians*, Abingdon New Testament Commentaries (Nashville: Abingdon

Press, 2000), 58. [13]Simpson and Bruce, 199, n. 85. [14]Bratcher and Nida, 24. [15]J. B. Lightfoot, *St. Paul's Epistles to the Colossians and to Philemon*, rev. (London: Macmillan & Co., 1916), 153. [6]Robertson, 50. [17]Ibid., 49-50. [18]Bruce, 205. [19]చూడండి మత్తయి 28:18; 1 కొరింథీయులకు 15:25-27; ఎఫెసీయులకు 1:20-23; ఫిలిప్పీయులకు 2:10, 11; 1 పేతురు 3:22; కీర్తనలు 1:5; 12:5. [20]R. C. Lucas, *The Message of Colossians and Philemon: Fullness and Freedom*, The Bible Speaks Today (Downers Grove, Ill.: InterVarsity press, 1980), 53.

[21]Hay, 62. [22]Hendriksen, 81. [23]Herbert M. Carson, *The Epistles of Paul to the Colossians and Philemon: An Introduction and Commentary*, The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1960), 46-47. [24]Hay, 53.